## ఎడిటర్ వ్యూ

### బాబు గుబులు: ఈ సారైనా - కలుస్తారా.. ? -

కూటమి పార్టీల కలివిడి వ్యవహారం.. మరోసారి చర్చకు వచ్చింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఎన్డీయే కూటమి పార్టీల నాయకుల కీలక సమావేశం జరిగింది. ఈ సమయంలో మరోసారి చంద్రబాబు కలివిడి పాలిటిక్స్‌కు పిలుపునిచ్చారు. వచ్చే వారం నుంచి కూటమి పార్టీలు సంయుక్తంగా ప్రజల మధ్యకు వెళ్లాల ని ఆయన తేల్చి చెప్పారు. రెండేళ్ల పాలనకు సంబంధించిన విషయాలను ప్రజలకు వివరించాలని చేసిన మేలును పేర్కొనాలని ఆయన చెప్పారు.దీనికి మూడు పార్టీలు కలిసి రావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. అయితే.. చంద్రబాబు ఇలా కూటమి పార్టీల కలివిడి, ఉమ్మడి ప్రచారం.. ప్రజల మధ్యకు వెళ్లే అంశాలపై మాట్లాడడం ఇదే తొలిసారికాదు. గతంలో కూడా ఆయన కలివిడి కోసం ఏకంగా మూడు పార్టీల నాయకులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగం విషయంపై చర్చకు వచ్చినప్పుడు.. వైసీపీకి దీటుగా బదులు ఇచ్చేందుకు కూటమి పార్టీలు కలిసి పనిచేయాలని చంద్రబాబు కోరారు.కానీ, ఆ సమయంలో బీజేపీ నాయకులు పన్నెత్తు మాట కూడా అనలేదు. పైగా.. ఎవరికి వారు అన్నట్టుగా ఈ సమస్య తమదికాదన్నట్టుగా ఉన్నారు. దీంతో టీడీపీ నాయకులే ఈ విషయానికి కౌంటర్లు ఇచ్చారు. ఈ పరిస్థితిపై అప్పట్లోనే ఆవేదన వ్యక్తం చేసిన చంద్రబాబు.. పరిస్థితిని మార్చేందుకే సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. కానీ, ఆ సమన్వయ కమిటీలోనూ సమన్వయం లోపించింది. ఫలితంగా.. ఎలాంటి ముందడుగు పడలేదు. ఇక, తాజాగా రెండేళ్ల పాలనను ప్రజల మధ్యకు తీసుకువెళ్లేందుకు కలిసి రావాలని చంద్రబాబు మరోసారి పిలుపునిచ్చారు. అందరూ కలిసి ప్రజల మధ్యకువెళ్తామని.. చెప్పారు. అంతేకాదు.. ఈ నెలలోనే మూడు చోట్ల బహిరంగ సభలకు కూడా చంద్రబాబు ప్రణాళిక రెడీ చేశారు. విశాఖ సహా అమరావతిలో ఈ సభల ను నిర్వహించనున్నారు. మరి ఈ క్రమంలో అయినా.. కూటమి పార్టీలు, ముఖ్యంగా బీజేపీ రాష్ట్ర నాయక త్వం కలిసి వస్తుందా? రాదా? అనేది చూడాలి.

# భారత్‌పై ఎలాన్ మస్క్ కీలక వ్యాఖ్యలు.. తగ్గుతున్న జననాల రేటుపై ఆందోళన

ప్రపంచ కుబేరుడు, స్పేస్‌ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్ భారత్‌కు సంబంధించి చేసిన ఓ సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. భారత్‌లో జననాల రేటు గణనీయంగా తగ్గుతోందని, ఇది జనాభా స్థిరత్వానికి అవసరమైన ప్రతిస్థాపన స్థాయి (రీప్లేస్‌మెంట్ లెవెల్) కంటే కిందకు పడిపోయిందని ఆయన హైలైట్ చేశారు.ఈ అంశంపై మీడియా సంస్థ 'ఏఎఫ్ పోస్ట్' షేర్ చేసిన డేటాను ప్రస్తావిస్తూ మస్క్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "భారత్‌లో జననాల రేటు ప్రతిస్థాపన స్థాయి కంటే తగ్గింది. ముఖ్యంగా, బాగా చదువుకున్న వారిలో ఈ రేటు చాలా ఏళ్ల క్రితమే పడిపోయింది" అని తన పోస్టులో పేర్కొన్నారు. భారతదేశ చరిత్రలో తొలిసారిగా మొత్తం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) ప్రతి మహిళకు 2.1 పిల్లలు అనే ప్రతిస్థాపన స్థాయి కంటే కిందకు పడిపోయిందని 'ఏఎఫ్ పోస్ట్' నివేదిక వెల్లడించింది. గత దశాబ్ద కాలంలోనే ఈ రేటు 2.3 నుంచి 1.9కి క్షీణించిందని తెలిపింది. ఢిల్లీలో అయితే ఈ రేటు 1.2కి పడిపోయిందని, ఇది ఫిన్‌లాండ్ కంటే కూడా తక్కువని నివేదిక పేర్కొంది. ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్ (యూఎన్ఎఫ్‌పీఏ) విడుదల చేసిన 'స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ రిపోర్ట్ 2025' కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరించింది. భారతదేశంలో సంతానోత్పత్తి రేటు 1.9గా నమోదైందని, ఇది జనాభా స్థిరత్వానికి అవసరమైన 2.1 కంటే తక్కువ అని స్పష్టం చేసింది. సంతానోత్పత్తి రేటు ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో ప్రతి తరం మునుపటి తరం కంటే చిన్నదిగా మారి, దేశ జనాభా క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందని నివేదిక విశ్లేషించింది.

అయితే, జననాల రేటు తగ్గుతున్నప్పటికీ, 146 కోట్లకు పైగా జనాభాతో భారత్ ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా కొనసాగుతోంది. 2023లో చైనాను అధిగమించి భారత్ ఈ స్థానానికి చేరుకుంది. విద్య, పట్టణీకరణ పెరగడం, మహిళలు ఉద్యోగాల్లో చేరడం, మారుతున్న కుటుంబ ప్రాధాన్యతలు వంటివి జననాల రేటు తగ్గడానికి ప్రధాన కారణాలని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు, దేశంలో ఇప్పటికీ సామాజిక, ఆర్థిక అసమానతలు, ప్రసూతి మరణాలు, లింగ వివక్ష వంటి సవాళ్లు ఉన్నాయని యూఎన్ఎఫ్‌పీఏ నివేదిక తెలిపింది.

# రాజకీయాల్లోకి రాఘవ లారెన్స్?..

- మొదటి పేజీ తరువాయి

వినిపిస్తున్నాయి. విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) తరఫున ఆయన తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ ఉపఎన్నికలో పోటీ చేయబోతున్నారంటూ మీడియాలో విస్తృతంగా కథనాలు వస్తున్నాయి. ఈ ప్రచారంపై స్పందించిన లారెన్స్, తన భవిష్యత్తుకు సంబంధించి ఒక అత్యంత కీలకమైన నిర్ణయాన్ని జూన్ 11న ప్రకటించనున్నట్లు తెలిపి ఉత్కంఠను మరింత పెంచారు.

**ఏమిటీ ప్రచారం?**

తమిళనాడులోని 'తిరుచ్చి ఈస్ట్' అసెంబ్లీ నియోజకవర్గానికి త్వరలో ఉపఎన్నిక జరగనుంది. సీఎం విజయ్ రాజీనామాతో ఈ స్థానం ఖాళీ అయినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో, ఈ ఉపఎన్నికలో విజయ్ పార్టీ టీవీకే అభ్యర్థిగా రాఘవ లారెన్స్ బరిలోకి దిగుతారని వార్తలు వెల్లువెత్తాయి. సోషల్ మీడియాతో పాటు ప్రధాన మీడియా ఛానెళ్లలోనూ ఇదే అంశంపై చర్చ జరగడంతో, లారెన్స్ రాజకీయ ప్రవేశం ఖాయమనే సంకేతాలు వెలువడ్డాయి.

**ఊహాగానాలపై లారెన్స్ క్లారిటీ**

ఈ వార్తలు శ్రుతిమించడంతో రాఘవ లారెన్స్ స్వయంగా ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. "గత కొన్ని రోజులుగా నేను తిరుచ్చి ఈస్ట్ ఉపఎన్నికలో పోటీ చేస్తున్నట్లు వస్తున్న వార్తలపై క్లారిటీ కోసం మీడియా మిత్రులు నన్ను సంప్రదిస్తున్నారు. ఈ ఊహాగానాలకు తెరదించడానికే ఈ ప్రకటన చేస్తున్నాను" అని ఆయన తన నోట్‌లో పేర్కొన్నారు. తాను ప్రస్తుతం లోకేష్ కనగరాజ్ సమర్పణలో వస్తున్న 'బెంజ్' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నానని, ఆ షెడ్యూల్ జూన్ 10తో ముగుస్తుందని స్పష్టం చేశారు.

**జూన్ 11న అసలు విషయం**

తన ప్రకటనకు ముగింపు ఇస్తూ లారెన్స్ మరింత ఆసక్తిని రేకెత్తించారు. "షూటింగ్ పూర్తయిన మరుసటి రోజు, అంటే జూన్ 11వ తేదీ, గురువారం ఉదయం 9:30 గంటలకు మా అమ్మ ఆశీస్సులతో నా జీవితానికి సంబంధించిన ఒక అత్యంత ముఖ్యమైన నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటిస్తాను" అని వెల్లడించారు. లారెన్స్ రాజకీయాల్లోకి వస్తారా? వస్తే ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారు? లేక మరేదైనా కొత్త విషయం ప్రకటిస్తారా? అనే ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే జూన్ 11 వరకు ఆగాల్సిందే. ఆయన ప్రకటన కోసం అభిమానులు, రాజకీయ వర్గాలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

# నేడు పశ్చిమ గోదావరి జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన

- మొదటి పేజీ తరువాయి

జారీ చేసిన పాస్‌పుస్తకాల్లోని తప్పులను సరిదిద్ది, పారదర్శకమైన రీతిలో కొత్త పాస్‌పుస్తకాలను అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. రైతుల సమక్షంలోనే భూములను రీ-సర్వే చేసి, వారి ఆమోదం తర్వాతే తుది రికార్డులను సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతీ నెలా ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా రైతులతో సమావేశమై, వారి సమక్షంలోనే అధికారులతో భూ వివరాలను చదివించి పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు.

**6 నెలల్లో 26.46 లక్షల పాస్‌పుస్తకాల పంపిణీ**

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, జనవరి నుంచి రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేసింది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 6,688 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి కాగా, అందులో 6,459 గ్రామాలకు చెందిన 26.46 లక్షల మంది రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను ప్రభుత్వం అందించింది. రానున్న 9 నెలల్లో మరో 10,357 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి, 67.32 లక్షల పాస్‌పుస్తకాలను పంపిణీ చేయాలని సీఎం లక్ష్యంగా నిర్దేశించారు. దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బ్లాక్‌చైన్ ఆధారిత భూ రికార్డుల వ్యవస్థను అమలు చేస్తోంది. దీని ద్వారా ప్రతీ భూ యూనిట్‌కు ఒక శాశ్వత బ్లాక్‌చైన్ ఐడీ కేటాయిస్తున్నారు. తద్వారా రికార్డులను తారుమారు చేయడం అసాధ్యం. సర్వే నుంచి తుది రికార్డు వరకు ప్రతి దశలోనూ రైతు ఈ-కేవైసీని తప్పనిసరి చేశారు.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

సోమవారం ఉదయం 10:25 గంటలకు అమరావతి నుంచి బయలుదేరనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, 11 గంటలకు సిద్ధాంతం గ్రామానికి చేరుకుంటారు. 11:15 గంటలకు 'మీ భూమి-మీ హక్కు' ప్రజా వేదిక సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2:30 గంటలకు రైతులతో ప్రత్యేకంగా సమావేశమవుతారు. అనంతరం 3:15 గంటలకు టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలు ముగించుకుని సాయంత్రం 5:35 గంటలకు తిరిగి అమరావతికి చేరుకుంటారు.

# హైదరాబాదులో చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధం...

- మొదటి పేజీ తరువాయి

భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి స్వయంగా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌ను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఫ్యాన్లు, కూలర్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లు, సీపీఆర్ బృందాలను సిద్ధంగా ఉంచారు. భద్రత కోసం పోలీసులు, షీ టీమ్స్, సీసీటీవీలతో నిఘా ఏర్పాటు చేశారు.

చేప ప్రసాదం పంపిణీ నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ ఆంక్షలు జూన్ 8 ఉదయం 6 గంటల నుంచి

జూన్ 9 రాత్రి 8 గంటల వరకు అమల్లో ఉంటాయి. ఆర్టీసీ బస్సులు, వ్యాన్లలో వచ్చేవారు గాంధీభవన్ లేదా గృహకల్ప వద్ద, ఆటోల్లో వచ్చేవారు షెజాన్ హోటల్ వద్ద దిగి గ్రౌండ్స్‌కు చేరుకోవాలి. ఈ నేపథ్యంలో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని పోలీసులు సూచించారు.

# తెలంగాణలో స్కూళ్లకు వేసవి సెలవులు పొడిగింపు..

- మొదటి పేజీ తరువాయి

తేదీని పునఃపరిశీలించాలని ప్రభుత్వం వద్దకు పలు అభ్యర్థనలు వచ్చాయి.ఈ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, విద్యార్థుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సెలవులను పొడిగించడమే సరైనదని భావించింది. దీనితో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు జూన్ 15వ తేదీ సోమవారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయని విద్యాశాఖ స్పష్టం చేసింది.

# సత్యనారాయణ గారూ.. రేపు కలుద్దాం'.. సీఎం చంద్రబాబు పోస్ట్

- మొదటి పేజీ తరువాయి

చంద్రబాబు సభకు వెళ్లేందుకు సత్యనారాయణ సిద్ధమయ్యారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతుండగా ఓ యువకుడు వీడియో తీసి సోషల్ మీడియోలో పోస్ట్ చేశాడు. ఈ విషయం తెలుసుకుని సీఎం చంద్రబాబు స్పందించారు. 'సత్యనారాయణ గారూ.. రేపు సిద్ధాంతంలో కలుద్దాం' అని పోస్ట్ చేశారు.

# మా కార్యకర్తలు తలచుకుంటే కాంగ్రెస్ నేతలు గ్రామాల్లో తిరగలేరు

- మొదటి పేజీ తరువాయి

తీసుకునే రైతులకు పరిహారం ఇవ్వాల్సిందే. రైతులు వ్యతిరేకిస్తున్నా.. కోహెడ పండ్ల మార్కెట్‌కు శంకుస్థాపన చేశారు. రైతులకు పరిహారం ఇచ్చాకే పండ్ల మార్కెట్ పెట్టాలి. కాంగ్రెస్ నేతలు రైతుల భూములు కాజేస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేయకుండా వారిని ఇబ్బందులు పెడుతున్నారు. కేంద్రం నుంచి రూ.13లక్షల కోట్లు తెలంగాణకు ఇచ్చాం. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులపై సచివాలయం వద్ద చర్చకు సిద్ధంగా ఉన్నాం" అని రామచందర్‌రావు అన్నారు.

# కూటమి ప్రభుత్వానికి ఏపీజేఏసీ హెచ్చరిక.. డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమమే!

- మొదటి పేజీ తరువాయి

నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు చెల్లించాల్సిన కరవు భత్యం (డీఏ) బకాయిలను వెంటనే విడుదల చేయాలని, మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని, కొత్త వేతన సవరణ సంఘం (పీఆర్సీ)ను అమలు చేయాలని నాయకులు ప్రధానంగా డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ అంశాలపై త్వరగా స్పందించకపోతే ఉద్యమించడమే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం 13 మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీ సోమవారం (జూన్ 8) నుంచి తన కార్యాచరణను ప్రారంభిస్తుందని వెల్లడించారు.

తమ పోరాటానికి ఇతర ఉద్యోగ సంఘాల నుంచి మద్దతు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన ఈ కీలక అంశాలపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. కాగా, ఏపీఎస్ఆర్టీసీ భవిష్యత్తు కార్యాచరణపై సోమవారం మరో ప్రత్యేక సమావేశం జరగనున్నట్లు నాయకులు తెలిపారు.

# పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం.. ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన కమిటీ రద్దు

- మొదటి పేజీ తరువాయి

జారీ చేశారు. జిల్లా, నగర, మండల, గ్రామ స్థాయి కమిటీలను రద్దు చేస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపారు.నెల్లూరు జిల్లాలో నాయకుల మధ్య తీవ్రమైన విభేదాలు, క్రమశిక్షణారాహిత్యం పెరిగిపోయిందని పార్టీ అధిష్ఠానం దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. నాయకులు పార్టీ విధానాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, వారి వైఖరి వల్ల కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జన సైనికులు, పార్టీ మద్దతుదారుల నుంచి ఫిర్యాదులు అందాయని పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

"క్రమశిక్షణ లేని చోట వ్యవస్థను సక్రమంగా నిర్వహించలేం. అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది" అని పవన్ వివరించారు. కొద్ది రోజుల క్రితమే ఉమ్మడి ప్రకాశం జిల్లా కమిటీని కూడా ఇదే కారణాలతో రద్దు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అదే తరహా చర్యను ఇప్పుడు నెల్లూరు జిల్లా విషయంలోనూ తీసుకున్నట్లు తెలిపారు.ఈ నిర్ణయంతో జిల్లా సమన్వయ బాధ్యతలు చూస్తున్న వారితో సహా కమిటీల్లోని సభ్యులందరూ తమ బాధ్యతల నుంచి తప్పుకున్నట్లయింది. కొత్త కమిటీని నియమించేంత వరకు ఉమ్మడి నెల్లూరు జిల్లా పార్టీ వ్యవహారాలను కేంద్ర కార్యాలయం నుంచే పర్యవేక్షిస్తామని జనసేన స్పష్టం చేసింది.

# టీవీకే ప్రభుత్వం మూడు నెలలైనా ఉంటుందా?:

- మొదటి పేజీ తరువాయి

2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచే డీఎంకే 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం క్షేత్ర స్థాయిలో చర్యలు మొదలు పెట్టిందని వెల్లడించారు.బూత్ స్థాయి ఏజెంట్లను నియమించడం, ప్రాంతీయ సమావేశాలు నిర్వహించడం వంటి ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నా అధికారంలోకి రాలేకపోయామని అన్నారు.కానీ కొందరు మాత్రం ఓటర్లను కలవకపోయినా, బూత్ ఏజెంట్లను నియమించకపోయినా గెలిచి ప్రభుత్వాన్ని ( ఏర్పాటు చేశారని స్టాలిన్ అన్నారు. అటువంటి ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉంటుందని తాను అనుకోవట్లేదన్నారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడాన్ని నివారించాలనే ఏకైక ఉద్దేశంతోనే టీవీకే (ఎఖ)కు మద్దతిచ్చేందుకు తమ కూటమిలోని భాగస్వామ్య పక్షాలను అనుమతించామని పేర్కొన్నారు. అలా చేయకపోతే తమిళనాడులో భాజపా పాలనకు మార్గం సుగమం అయ్యేదన్నారు. తమ కూటమిలోని పార్టీలు మద్దతు ఇవ్వడం వల్లే ప్రస్తుత ప్రభుత్వం నడుస్తోందన్నారు.

# క్వారీ ప్రాంత నీటి కొరతకు రూ.95 కోట్లతో శాశ్వత పరిష్కారం

- ముంపు సమస్యల నివారణకు రూ.25 కోట్లతో సమగ్ర ప్రణాళిక
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సమీక్ష



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 7:**క్వారీ ప్రాంత ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. అమృత్ 2.0 పథకం కింద సుమారు రూ.95 కోట్ల వ్యయంతో సమగ్ర తాగునీటి ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులతో నిర్వహించిన విస్తృత సమీక్ష సమావేశంలో ప్రాజెక్టును ఏడాదిలోగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఆధునిక సదుపాయాలతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం, రోజుకు 20 ఎంఎల్డీ సామర్థ్యంతో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటు, శాశ్వత రా వాటర్ పికప్ పాయింట్ నిర్మాణం, సమగ్ర పైప్‌లైన్ వ్యవస్థ అభివృద్ధి వంటి కీలక పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే క్వారీ ప్రాంత ప్రజలకు నిరంతర, నాణ్యమైన తాగునీటి సరఫరా అందుబాటులోకి వచ్చి దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. . నగరంలో లోతట్టు ప్రాంతాల్లో నీటిముంపును శాశ్వతంగా నివారించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. సుమారు రూ.25 కోట్లుగా ఉండొచ్చని సూచించారు. త్వరలోనే ఉన్నతాధికారులు, సాంకేతిక నిపుణులతో మరో సమీక్ష సమావేశం నిర్వహించి తుది నిర్ణయాలు తీసుకుని పనులను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# మండలంలో బంగారం అమ్మకాల్లో మోసాల భూతం

**వినియోగదారులకు కుచ్చుటోపి.. అనుమతులు లేని యంత్రాలతో దందా పట్టించుకోని అధికారులు**

**సీతానగరం, పెన్ పవర్, జూన్:07:**కొనేదంత బంగారమే అంటున్నారు చివరకు అమ్ముదామంటే మీ బంగారంలో కల్తీ ఉందంటూ తగ్గింపులు చేస్తున్నారు ధనం లేకుండా పొలం బంగారం అయినా ఒంటిమీద ఉండాలనేది సగటు మధ్య తరగతి ప్రజల మనోగతం బంగారాన్ని లక్ష్మీదేవిగా భావించి వ్యవసాయం పంట డబ్బులు చేతికి వచ్చిన తర్వాత కొన్ని గ్రాముల బంగారం కొనుగోలు మండల ప్రజలు చేస్తున్నారు. కొన్న బంగారాన్ని మార్చి మరో ఆభరణం కోసం వెళితే పాత బంగారంలో కల్తీ ఉందంటూ వ్యాపారులు కొసరడుగుతుండడం ఈమధ్య బాగా ఎక్కువైంది దీనికి ప్రధాన కారణం ప్యూరిటీ చెక్ చేసే యంత్రాలను వాడకుండా వ్యాపారులు కొన్న బంగారంలో కత్తెర పెడుతూ జనాన్ని దోచుకునే వారి సంఖ్య బాగానే పెరిగిందని చెప్పవచ్చు. సీతానగరం మండల కేంద్రంలో బంగారం వ్యాపారమంతా బాగానే జరుగుతుంటుంది నిత్యం కొన్ని వందల గ్రాముల బంగారం వ్యాపారం జరుగుతుంది పెళ్లిళ్ల సీజన్లో మాత్రం కొనే వారి సంఖ్య భారీగానే ఉంటుంది ఆషాడం మాసంలో మాత్రం పాత బంగారంతో కొత్త ఆభరణాలు చేయించుకునే వారి సంఖ్య ఈమధ్య బాగా పెరిగింది సినిమాలు టీవీ సీరియల్స్‌లో వచ్చే కొత్త బంగారు మోడల్స్ మహిళలు చూసి చాలామంది చేయించుకుంటున్నారు. ఇంతకుముందు పెళ్లినడు ఏ నగలైతే పెట్టే వాళ్లో వాటిని భద్రంగా కాపాడుకుంటూ శుభకార్యాలలో ధరించే వాళ్ళు కానీ ప్రస్తుతం ట్రెండ్ మారడంతో పాత నగలను ఫ్యాషన్కు అనుగుణంగా మార్చుకోవడం పరిపాటిగా మారింది మరోపక్క బంగారం ధరలు రోజురోజుకు చుక్కలనంటుతున్న కొనుగోలు మాత్రం తగ్గకపోవడం గమనార్హంగా మారింది ట్రెండెను బట్టి పాత బంగారంతో కొత్త నగలు చేయించుకోవాలనుకొన్న వారికి బంగారం షాపు యాజమాన్యులు ఈ టంచ్ మిషన్ వ్యాపారులు అమాయక ప్రజల కుచ్చుటోపి పెడుతున్నారు. మోసం చేస్తున్న వారిపై ఫిర్యాదులు రాకపోవడంతో పోలీసులు నిఘా వర్గాలు పట్టించుకోవడం లేదు బంగారం మాసాలపై నిత్యం వినియోగదారులకు సహాయపడేందుకు ఉన్న బీఐ ఎస్ తన పని మర్చిపోయినట్టుంది. లీగల్ మెట్రాలజీ అధికారులు సైతం ఇది తమ పని కాదన్నట్లు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలు తావిస్తుంది. సీతానగరం మండల కేంద్రంలోని అనేక రకాలుగా భారీ మోసాలు జరుగుతున్న విజిలెన్స్ అధికారులు మాత్రం కనిపించకపోవడం విడ్డూరంగా ఉంది అనేకసార్లు తమకు బంగారు ఆభరణాలు మోసాలు జరిగాయి అంటూ దుకాణాల ముందు వినియోగదారులు ఆందోళన చేసిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటివరకు అధికారులు బంగారంపై మోసం కేసులు నమోదు చేయకపోవడమే వారి పనితనానికి దర్పణం పడుతుందని చెప్పవచ్చు. బంగారం మాసాల రోజు రోజుకు పెంచి మీరుతున్న అధికారులు మాత్రం బంగారం దుకాణ యాజమాన్యంతో సత్సంబంధాలు పెట్టుకొని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి అనుమతులు లేని షాపులపై నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాల్సిన అధికారులు ఎందుకు ఉపేక్షిస్తున్నారని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. నగ నచ్చక నో, ఆభరణం పాతబడడమే కొత్త మోడల్ మార్కెట్లోకి రావడమే జరుగుతుంది. దీంతో తమ ఆభరణాన్ని కరిగించి మరో ఆభరణం తయారు. చేయించుకుందామని బంగారం దుకాణదారుని దగ్గరకు మహిళలు వస్తున్నారు పాత నగను కరిగించి దాంట్లో బంగారం శాతం ఎంత ఉందో తెలుసుకోవడానికి ముందే ఒప్పందం కుదుర్చుకున్న టంచ్ మిషన్ దగ్గరికి పంపిస్తున్నారు ఈ టచ్ మిషన్ లో ఒప్పందం మేరకు ముందే సవరించిన రీడింగ్లతో బంగారం సాతాన్ని నిర్ధారణ చేస్తున్నారు. వాస్తవానికి పాత నగలో ఉన్న బంగారం శాతం కంటే ఐదు నుంచి పది శాతం తక్కువ నిర్ధారణ చేసి వినియోగదారులను మోసం చేస్తున్నారు ఇది టంచ్ మిషన్లతో జరుగుతున్న మోసం అయితే వాస్తవానికి బంగారం నాణ్యతను పాత బంగారంలో బంగారం సాతాని నిర్ణయించేందుకు బిఐఎస్ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ సంస్థల్లో నిర్ధారణ చేయించాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బంగారం నాణ్యతను నగలలోని బంగారం సాతాన్ని నిర్ధారణ చేయించడానికి బి ఐ ఎస్ అనుమతి పొందిన సంస్థలకే నిర్ధారణ అర్హతల ఉంటాయని విషయం అందరికీ తెలిసిందే కానీ సీతానగరం మండల కేంద్రంలో మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండా ఎక్స్ రే ఫ్లోరోసెన్సు మిషన్ కంప్యూటర్ అనుసంధాన యంత్రాల టంచ్ మిషన్
తో యధాచగా బంగారం నాణ్యత ప్రమాణాలు నిర్ధారణ చేస్తున్నారు. కేవలం బంగారం షాపుల యజమానులే వినియోగదారులను మోసం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మండల కేంద్రంలో సుమారు 5 టంచ్ మిషన్ లో ఉన్నట్లు తెలుస్తోంది జీరో దందాలో భాగంగా సాధారణ పేపర్ మాత్రమే ప్యూరిటీ పర్సంటేజీలను పేర్కొనడంతో వారి ఆగడాలకు అంతులేకుండా పోతుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్న నిందితుడి పై పి డి చట్టం అమలు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 7**
ఆస్తి నేరాలకు పాల్పడుతూ, ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్న అలవాటు నేరస్థులపై కఠిన చర్యల్లో భాగంగా టి.వి. రోడ్, సారంగధర మెట్ట, కు చెందిన కోసూరి వెంకట రమణ పై ప్రివెంటివ్ డిటెన్షన్ (పీ.డి.) చట్టం అమలు చేశారు. ఈ వ్యక్తి అలవాటు ఆస్తి నేరస్థుడు కాగా, అతనిపై 42 క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. వీటిలో అనేక ఆస్తి సంబంధిత నేరాలు ఉండటం వల్ల ప్రజా శాంతి భద్రతలకు ముప్పుగా మారినందున, భవిష్యత్తులో మరిన్ని నేరాలు జరగకుండా నిరోధించేందుకు సంబంధిత అధికారులు అతనిపై పీ.డి. చట్టం అమలు చేశారు.
తూర్పు గోదావరి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు, రౌడీ ఎలిమెంట్స్, అలవాటు నేరస్థులు ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయి. నేర కార్యకలాపాల్లో నిరంతరం పాల్గొనే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, అవసరమైతే పీ.డి. చట్టం కూడా అమలు చేస్తామన్నారు ప్రజల శాంతి భద్రతలు, సురక్షిత వాతావరణం ప్రజా క్రమశిక్షణ పరిరక్షణకు పోలీస్ శాఖ కట్టుబడి ఉన్నదన్నారు.

# 45, 46వార్డుల్లో ఉచిత కంటి వైద్య శిబిరం

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 7:** ప్రతిపక్షంలో ఉన్నా సరే, వైద్యానికి ప్రాధ్యాన్యత ఇచ్చి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని మాజీ ఎంపీ వై.ఎస్.ఆర్.సి.పి జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ చెప్పారు. ఆదివారం స్థానిక ఆనంద్ నగర్ బెట్టి కాన్వెంట్ రోడ్డులో ఉచిత కంటి వైద్య శిబిరం భరత్ ఆధ్వర్యంలో జరిగింది. వాసన్ ఐ కేర్ హాస్పిటల్ నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు ఈ శిబిరంలోకంటి పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా భరత్ మాట్లాడుతూ ఈ కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన రావడం పట్ల భరత్ ఆనందం వ్యక్తంచేసారు. 45,46వార్డులకు సంబంధించి ఈ శిబిరం నిర్వహించామని భరత్ తెలిపారు. పెద్దవాళ్ళతో పాటు చిన్నపిల్లలు కూడా ఈ శిబిరానికి వచ్చి కంటి పరీక్షలు చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. ఐ డ్రాప్స్, మందులు ఇవ్వడం జరిగిందని భరత్ తెలిపారు. కంటి అద్దాలు పదిరోజుల్లో ఏర్పాటు చేస్తామన్నారు. కేటరాక్ట్, రెటీనాకు ఆపరేషన్లు మార్గాని భరత్ ఫౌండేషన్ తో పాటు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డ్ , వైఎస్ఆర్సిపి రాష్ట్ర సెక్రటరీ వాసంశెట్టి గంగాధర్, వైఎస్ఆర్సిపి 46 వార్డ్ ఇంచార్జ్ కల్లి మురళి కృష్ణ, ఎస్.డి. జిలాని, పులి సాగర్, మీసాల ధనరాజు, మడ్డు ధనరాజు, జానీ, సంతోష్, సుల్తాన్, సూర్య, 45వ వార్డు నాయకులు అల్లు జయరాజ్, లోవ రాజ్, బత్తిన చక్రరావు తదితరులు పాల్గొన్నారు.



# నాటుసారా నిర్మూలనకు ప్రజల సహకారం అభినందనీయం




- నవోదయం 2.0 కార్యక్రమం సమర్థవంతంగా పూర్తి
- ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ

**తాళ్ళపూడి, పెన్ పవర్, జూన్ 7:**తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలతో కొవ్వూరు నియోజకవర్గ ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో నాటుసారా రహిత సమాజ నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవోదయం 2.0 కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేశామని, దానిలో భాగంగా నియోజకవర్గంలో కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాల్లో నాటు సారా తయారీ విక్రయాలు తగ్గాయని సీ.ఐ సత్యనారాయణ అన్నారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు తాళ్లపూడి మండలంలోని పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో గ్రామాల్లో పూర్తిస్థాయిలో సారా అమ్మకాలు తగ్గాయి. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నాటుసారా తయారీ విక్రయాలు కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దెబ్బతీయడంతో పాటు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. గ్రామస్థులు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండి ప్రభుత్వం కల్పిస్తున్న ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని, సూచించారు. నాటుసారా తయారీని పూర్తిగా మానుకునే కుటుంబాలకు ప్రభుత్వం రూ.15 వేల వరకు
ఆర్థిక సహాయం అందించి కిరాణా దుకాణాలు, కూరగాయల వ్యాపారం, గొర్రెలు, బర్రెల పెంపకం వంటి స్వయం ఉపాధి మార్గాలను ప్రోత్సహిస్తోందని అవగాహన కల్పించామని అన్నారు. అదేవిధంగా నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పిల్లల విద్యాభివృద్ధికి గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు ఉన్నత విద్యకు అవసరమైన సహాయం అందించడంతో పాటు అర్హులైన కుటుంబాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని నాటుసారా వ్యాపారాన్ని పూర్తిగా విరమించుకోవాలని, లేకపోతే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే నియోజకవర్గంలో ఎవరైనా సారా అమ్మకాలు జరిపితే తమకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచబడతాయన్నారు. నియోజకవర్గంలో ఎవరైనా సారా అమ్మితే 9963217059 నెంబర్ ను సంప్రదించాలన్నారు.

## జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సండేస్ ఆన్ సైకిల్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 7:**
తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు, ఎస్పీ ఏ.వి. సుబ్బరాజు ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎల్. చెంచి రెడ్డి ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా ఆదివారం "సండేస్ ఆన్ సైకిల్" కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, మినిస్టీరియల్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని సైక్లింగ్ నిర్వహించారు. అనంతరం వాలీబాల్ క్రీడా పోటీలను కూడా నిర్వహించగా, సిబ్బంది క్రీడా స్ఫూర్తితో పాల్గొన్నారు.
పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, ఒత్తిడి నియంత్రణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు ఇటువంటి ఫిట్‌నెస్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అధికారులు తెలిపారు. విధి నిర్వహణలో సమర్థత, అప్రమత్తత, జట్టుగా పనిచేసే స్ఫూర్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి (ఏఆర్) టి.వి.ఆర్.కె. కుమార్ , ఆర్.ఐ (ఏఆర్) పి. సంజీవ్ కుమార్ , ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.




# నేడు యధావిధిగా జిల్లా స్థాయి పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 7:**ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ (గ్రీవెన్స్) మరియు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను జూన్ 8వ తేదీ సోమవారం యథావిధిగా నిర్వహించనున్నట్లు పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు.ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఉదయం 10.30 గంటలకు రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో పాటు రంపచోడవరం, చింతూరు డివిజన్లకు చెందిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్‌లో అన్ని మండలాల తహశీల్దార్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను మీకోసం పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని, అర్జీల స్థితిగతులను తెలుసుకోవడానికి 1100 టోల్ ఫ్రీ నంబర్ను సంప్రదించవచ్చని సూచించారు.ప్రజలకు సులభంగా సేవలు అందించేందుకు మండల స్థాయిలో కూడా గ్రీవెన్స్ డే, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను నిర్వహిస్తూ విస్తృత ప్రచారం చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వాట్సాప్ గవర్నెన్స్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని, 9552300009 నంబర్‌కు ఫిర్యాదులను పంపవచ్చని పేర్కొన్నారు. అందిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటారని కలెక్టర్ స్పష్టం చేశారు.



# లింగారి గూడెంలో మురుగు కాలువలు ప్రమాదకరంగా మారాయి





**ఏలూరు జూన్ 7 పెన్ పవర్ :** ఏలూరు మండలంలోని మాదేపల్లి శివారు కాలనీ లింగారి గూడెంలో మురుగు కాలువలు ఛిద్రమై మరుగుపేరుకుపోయి,కొన్ని చోట్ల ప్రమాదకరంగా మారాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.గ్రామ పంచాయితీ పాలనాధికారులు కాలనీవైపు కన్నెత్తి చూడడంలేదని,కాలనీలోని డ్రైన్లలోని మురుగు వారాల తరబడి పేరుకుపోయి దుర్వాసన వెదజల్లు తున్నాయని,కార్యదర్శి పర్యవేక్షణ లేకపోవడంతో పారిశుధ్యం క్షీణిస్తోందని,ఇంటింటా చెత్త సేకరణ విధిగా నిర్వహించాల్సి ఉన్నా సక్రమంగా చెత్త సేకరణ జరగడంలేదని,స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రకార్యక్రమాలు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారని ప్రజల నుండి విమర్శలు వ్యక్తమౌతున్నాయి. డ్రైన్లలోని మురుగును వారానికోమారు మొక్కుబడిగా తీసి డ్రైన్ల గట్లపై వేస్తు, తొలగించిన పూడికను తరలించడం లేదని, డ్రైన్లలో దోమల నివారణ మందులు,పారిశుధ్యం క్షీణించిన ప్రాంతాల్లో బ్లీచింగ్, దోమలు నివారణకు ఫాగింగ్ వంటి చర్యలు తీసకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.మండల స్దాయి పర్యవేక్షణాధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## కూటమి ప్రభుత్వ ద్వంద నీతి పై ధ్వజమెత్తిన కె ఆర్ పి ఎస్

- పవన్ కళ్యాణ్ పై కాపుల పై వ్యాఖ్యలకు ఖండన
- మీడియా సమావేశంలో కాపు రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు



**రాజమహేంద్రవరం పెన్ పవర్, జూన్ 7:**ఎన్నికల ముందు కాపు సామాజిక వర్గాల చేత ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన కూటమీ ప్రభుత్వం కాపుల సమస్యలను పరిష్కారించడంలో ద్వందనీతిని పాటిస్తున్న వైఖరి పై కాపు రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు ధ్వజమెత్తారు. ఇటీవల ఒక సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కాపులను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. స్థానిక పుష్కర ఘాట్ లో శ్రీ కన్య కన్వెన్షన్ హాల్లో ఆదివారం కాపు రిజర్వేషన్ పోరాట సమితి, కాపు రాజ్యాధికార పోరాట సమితి, కాపు రక్షణ చట్ట పోరాట సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆత్మగౌరవ సభ రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాసు అధ్యక్షతన జరిగింది. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి చంద్రబాబు ప్రభుత్వం కాపు రిజర్వేషన్లలో వివక్షత పాటిస్తుందని విమర్శించారు. చంద్రబాబు వ్యతిరేక విధానాలను ప్రధాని మోడీ దృష్టికి తీసుకు వెళ్తామని అన్నారు. రాష్ట్రంలో కాపులకు న్యాయం జరగకపోతే పరిష్కరించకపోతే వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతామన్నారు. రాష్ట్ర చైర్మన్ చనమల్ల ప్రసాద్ రావు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదిగిన విద్యా ,ఉద్యోగ ఉపాధి, రాజకీయ అవకాశాల్లో అన్యాయం చేస్తుందని విమర్శించారు. దేశంలో కోర్టులు కొట్టేసిన ముస్లిం మత మైనారిటీలకు కూటమి ప్రభుత్వం రిజర్వేషన్లు అమలు చేయడం వ్యతిరేకిస్తున్నామన్నారు కాపుల సమస్యలను పరిష్కరిస్తారని, ఉద్ధరిస్తారని భావించిన పవన్ కళ్యాణ్ కాపులను పట్టించుకోక పోవడం దారుణం అన్నారు. బిసి ల కులానికి, రక్షణకు సంబంధం ఏముందని కాపులకు రక్షణ చట్టం కావాలన్నారు. రాష్ట్ర కోఆర్డినేటర్ జెటి రామారావు కాపులను అవహేళన గా మాట్లాడిన పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఉపసరించు కోవాలని, వెంటనే రాజీనామా చేయాలని చేశారు. బడుగు, బలహీన వర్గాలకు అమలు చేస్తున్న రిజర్వేషన్లను కూటమి ప్రభుత్వం కుల, మత ల పరంగా ద్వంద విధానాలు పాటిస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో సమితి నాయకులు మాసాబత్తుల శ్రీనివాసు, జానపాముల నాగేంద్ర కుమారు, వంగ ఆంజనేయులు ,కాకిలేటి హరినాథ్, బోడపాటి పెదబాబు , కోపల్లి సత్య, జవాది లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్ల ఊహించని అభివృద్ధి



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 07:**ఎవరికి ఏ కష్టం వచ్చినా కులం, మతం, ఏ రాజకీయ పార్టీ అని చూడకుండా అందరివాడిగా తక్షణమే స్పందించి ఆదుకునే ఉన్నత వ్యక్తిత్వం గల బొలిశెట్టి శ్రీనివాస్ ఎమ్మెల్యే కావటం తాడేపల్లిగూడెం ప్రజలు అదృష్టంగా భావిస్తున్నారని గూడెం మండల జనసేన నాయకులు పేర్కొన్నారు.కూటమి పాలన రెండేళ్లు పూర్తయిన సందర్బంగా,తాడేపల్లిగూడెం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు అడపా ప్రసాద్ ఆధ్వర్యంలో, జగన్నాధపురం గ్రామంలో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో తాడేపల్లిగూడెం మండలం నరకంగా మారిందని, రోడ్లు లేక మండలంలో ఏ గ్రామానికి వెళ్లాలన్నా ప్రజలు ఎన్నో అవస్థలు పడ్డారని అన్నారు.వైసిపి అవినీతి, అక్రమాలను భరించలేక ప్రజలు ఆ పార్టీని చిత్తుగా ఓడించి 11 సీట్లకు పరిమితం చేశారని అన్నారు.రెండేళ్లు గడిచినా ఇంకా ఆ పార్టీ గుణపాఠం నేర్చుకోలేదని విమర్శించారు. వైసిపి ప్రవర్తన మార్చుకోకపోతే ప్రస్తుతం 40శాతం అని చెప్పుకుంటున్న ఓట్ల శాతం 4 శాతానికి పడిపోక తప్పదని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లా విజయవంతమైన సారధ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వెన్నుపోటు అంటూ వైసీపీ నేతలు అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుంటే వైసీపీ నేతలకు కళ్ళు కనిపించడం లేదన్నారు. తాడేపల్లిగూడెం మండలంలో నవాబ్ పాలెం, అప్పారావుపేట, మాధవరం, వెంకట్రావు పాలెం తదితర గ్రామాల ప్రధాన రహదారులు వైసిపి పాలన లో శిథిలావస్థకు చేరాయని అన్నారు. బొలిశెట్టి ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన వెంటనే నియోజకవర్గంలోని రోడ్లన్నిటిని పూర్తిచేయాలనే సంకల్పంతో రోడ్ల నిర్మాణం చేపట్టి రెండేళ్లలో పూర్తిచేసిన ఘనత ఎమ్మెల్యేకి దక్కిందని అన్నారు.అభివృద్ధి తో పాటు ఎమ్మెల్యే బొలిశెట్టి తన సొంత నిధులతో భారీ ఎత్తున చేస్తున్న దానధర్మాలు, సేవా కార్యక్రమాలు అపూర్వమని అన్నారు. జనసేన కార్యకర్త ఎవరైనా మరణిస్తే తన సొంత నిధులు 5లక్షలు ఇచ్చి ఆదు కుంటారని, ఇతర పార్టీలకు చెందిన వారు,గత ఎన్నికల్లో తన ఓటమికి పనిచేసిన వారైనా ఆపద వస్తే ఆదుకోవడంలో ఆయనే ముందుంటారని అన్నారు. ఆయన కార్యదక్షత, దాతృత్వం, ఉత్తమ నాయకత్వం కారణంగా రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ ల తర్వాత అత్యధిక చరిష్మా కలిగిన నేత గా నిలిచారని అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని అన్ని రంగాలలోనూ ప్రథమ స్థానంలో నిలిపే విధంగా నిజాయితీగా పనిచేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టికి ప్రజలందరూ అండగా నిలవాలని వారు కోరారు. ఈ సమావేశంలో గూడెం మండల జనసేన నాయకులు మాట్లాడారు.

# క్షేత్రస్థాయిలో బూత్ కమిటీలు పూర్తిగా నిర్మాణం చేయాలి





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 07:**ఎలా అగ్రహారం గ్రామంలో తాడేపల్లిగూడెం రూరల్ మండలం బిజెపి పార్టీ మండల సమావేశం మండల అధ్యక్షుడు సమయ మంతుల కాశి అధ్యక్షత వాహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి మండల ఇన్చార్జ్ నరిసే సోమేశ్వరరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బూత్ కమిటీలు పూర్తిగా నిర్మాణం చేయాలని వాటి స్థానంలో శక్తి కేంద్ర ఇన్చార్జిలుగా మండల పదాధికారులు నియమించుకోవాలని 12 సంవత్సరాలు ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్నటువంటి అనేక సంక్షేమ కార్యక్రమాల్ని ప్రజల వద్దకు తీసుకెళ్లాలని ప్రజా సమస్యల పట్ల బిజెపి నాయకులు కార్యకర్తలు సమిష్టిగా కృషిచేసి ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని క్షేత్రస్థాయిలో బిజెపి బలోపేతం చేయడానికి అందరం సమిష్టిగా కృషి చేయాలని బిజెపి నరసాపురం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి పిలుపుమేరకు అన్ని మోర్చా కమిటీలు పూర్తిస్థాయిలో నిర్మాణం జరగాలని కార్యకర్తల నిర్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కొల్లి రాజశేఖర్ నల్లూరి శ్రీనివాస్ అడవటి అప్పారావు బాపూజీ ముళ్ళపూడి రత్నాజీ తదితరులు పాల్గొన్నారు

## గురకలపేటలో కదలని మురుగు.. కాలనీ వాసులకు తప్పని ఇబ్బందులు





**ఏలూరు జూన్ 7 పెన్ పవర్ :** ఏలూరు మండలం మాదేపల్లి పంచాయితీ పరిధిలోని శివారు కాలనీ గురకల పేటలో కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో మురుగు కదలక అపరిశుభ్రంగా తయారయ్యాయని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.పంచాయితీ సిబ్బంది ఇటు వైపు కన్నేత్తి చూడడంలేదని వ్యాఖ్యానిస్తున్నారు.కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా గత ప్రశుత్వ హాయాంలో ఈ కాలనీ వమౌళిక సదుపాయాలకు నోచుకోలేదు.కాలనీలో ఎక్కడికక్కడ చెల్తా చెదారాలతో కాలువలు పూడుకు పోవడంతో మురుగునీరు పారుదల ఉండడంలేదని,పలు చోట్ల మురుగు తిష్టవేసి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. దోమల తీవ్రతకు ప్రజలు కాలనీవాసులు అల్లాడిపోతున్నారు.రాత్రి సమయాల్లో కంటిపైకునులు ఉండడంలేదని,సాయంత్రమైతే దోమలు చుట్టుముడుతున్నాయని,ఇదే పరిస్దితి కొనసాగితే రోగాల బారిన పడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పారిశుధ్య సిబ్బంది ఈ కాలనీని రోజులుగా విస్మరించడంతో అక్కడ మురుగుకాలువ ఆనవాళ్లే లేకుండా పోయింది.ఈ కాలనీలో సుమారు 200 కుటుంబాలు నివసిస్తున్నాయి. పారిశుధ్యవిషయమై పంచాయితీ అధికారులకు ఎన్ని సార్లు విన్నివించినా పట్టించుకుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. డ్రైయిన్లలో పూడిక తీత,బీ ?లచింగ్,ఫాగింగ్ వంటి చర్యలు లేక కదలని మురుగుతో దోమలతో ఇబ్బందు తప్పడంలేదని వాపోతున్నారు.గ్రామ పంచాయితీకి ప్రత్యేక అధికారుల పాలనవచ్చినా, పర్యవేక్షణ అధికారులు ఈ కాలనీ సమస్యలు పరిష్కారం కావడంలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సంభందిత అధికారుల స్పందించి కాలనీలోని పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు

# బోరు మంటున్నాయి



**ఏలూరు జూన్ 7 పెన్ పవర్ :** వేసవి వచ్చిందంటే భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి.అవసరాలకు సరిపడానీరు దొరకడం కష్టంగా మారుతోంది.నగర పాలక సంస్ద పరిధిలోని పలు డివిజన్లలో కాలనీ ప్రజలు చేతిపంపులపైనే ఆధారపడతారు.అవి కూడా మరమ్మతులకు గురికావండంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడంలేదు.ఏలూరు నగరంలో 50 వివిజన్లలో 2.లక్షల 75 వేల జనాభా ఉంది 1లక్షా 50వేల కుటుంబాలు నివసిస్తున్నాయి.నగర వ్యాప్తంగా దాదాపు 350 వరకు చేతి పంపులు ఉన్నాయి.కుళాయిల్లో నీరు రాని సమయంలో స్దానికులు వీటిపైనే ఆధారపడతారు.వీటిలో 70 శాతం మరమ్మతులకు గురయ్యాయి.చిన్నపాటి మరమ్మతులు కూడా చేయకపోవడంతో తుప్పుపట్టి శిధిలోవస్దకు చేరుతున్నాయి.కొన్ని ప్రాంతాల్లో సిమ్మెంట్రోడ్డుకు సమాంతరంగా బోర్లు ఉండడంతో నీరు పట్టుకునేందుకు ఉపయోగపడడంలేదు.సిమ్మెంట్ రోడ్లు నిర్మించే గుత్తేదారులు బోర్ల ఎత్తును పెంచకుండా వేస్తున్నారు.వీరి నిర్లక్ష్యం..ప్రజలకు శాపంగా మారుతోంది.గజ్జెల వారి చెరువు ప్రాంతంలో దుకాణదారులు బోర్లను ఆక్రమించేశారు.ఇంజనీరింగ్ విభాగంలో చేతి పంపులను పర్యవేక్షించేందుకు సిబ్బంది ఉన్నారు.బడ్జెట్ ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నా..ఇవి మరమ్మతులకు నోచుకోవడంలేదు.18వ డివిజన్లో పడమర లాకులకు వెళ్లే దారిలో ఎఫ్.సి.పి నిధులతో 2008 లో డ్రిప్ హ్యాండ్ బోరు నిర్మించారు. 6నెలలకే మరమ్మతులకు గురైంది అప్పటి నుండి మున్సిఫల్ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది దీనిని పట్టించుకోలేదు.అధికారులు స్పందించి చేతి పంపులకు మరమ్మతులు చేయించాలని నగర వాసులు కోరుతున్నారు.

# నగరంలో అందుబాటులోకి గుండె , ఊపిరితిత్తుల మార్పిడి చికిత్సలు

- గుండె , ఊపిరితిత్తుల వ్యాధులపై
- ఆధునిక వైద్య విధానాలపై సదస్సు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 7:**హైదరాబాదు, బొంబాయి, ఢిల్లీ వంటి మెట్రో నగరాలకే పరిమితమైన గుండె , ఊపిరితిత్తుల మార్పిడి ఆధునిక చికిత్సలు నగరంలో హాస్పిటల్స్ లో అందుబాటులోకి సీనియర్ డాక్టర్ జి ఎస్ఎల్ మెడికల్ కాలేజీ అధినేత డాక్టర్ గన్నీ భాస్కర రావు అన్నారు. పల్స్ కార్డియాక్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఐ ఎం ఏ హాల్లో వైద్యులకు, వైద్య విద్యార్థులకు
నిరంతర వైద్య విధానాలపై ఒక రోజు సదస్సు జరిగింది. ఈ సదస్సులో కోస్తా, గోదావరి జిల్లాల నుండి సుమారు 200 వైద్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ, మానవుల్లో మెదడు గుండెకు, ఊపిరితిత్తులకు అనుసంధానం ఉంటుందని జీవనశైలిలో వచ్చిన మార్పులకు పిల్లలు, పెద్దలతో సహా గుండె, ఊపిరితిత్తుల వ్యాధులు వస్తున్నాయన్నారు.
ఈ రెండు వ్యాధుల్లోనూ ప్రపంచస్థాయి ఆధునిక వైద్య విధానాలు నగరంలో అందుబాటులోకి వచ్చాయ న్నారు. డాక్టర్ గూడూరి శ్రీనివాసు మాట్లాడుతూ, రెండు దశాబ్దాలుగా గుండె, ఊపిరితిత్తుల వ్యాధులు పెరిగాయని, అదే స్థాయిలో ఆధునిక వైద్య చికిత్సలు కూడా
తక్కువ ఖర్చుతో అందుబాటులోకి వచ్చేయన్నారు.
ప్రపంచ వ్యాప్తంగా నిరంతరం వస్తున్న వైద్య విధానాలను పని చేస్తున్న వైద్యులకు, కొత్తవారికి అవగాహన కల్పించేందుకు ఇటువంటి వైద్య సదస్సులు ఉపయోగపడతాయన్నారు. సమావేశంలో ఆల్స హాస్పిటల్ డాక్టర్లు కోసూరి కృష్ణమారాజు , సుజిత్ కిషన్, వంశి, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎం ఎల్ సి సోము వీర్రాజుని కలుసుకున్న బాల మేధావి దాసరోజు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 7 :**అత్యంత ప్రతిభావంతుడైన బాల మేధావి దాసరోజు నిటలాక్షరామ తన తల్లిదండ్రులతో కలిసి నగరానికి విచ్చేసి శాసనమండలి సభ్యులు సోము వీర్రాజుని కలుసుకుని ఆశీర్వాదాలు పొందారు.కేవలం ఐదు సంవత్సరాల వయస్సులోనే అసాధారణ ప్రతిభ కనబరుస్తున్న ఈ బాలుడు పురాణాలు, ఇతిహాసాలు, వేదాలు, శ్లోకాలు, సైన్స్, జనరల్ నాలెడ్జ్, ఇంగ్లీష్ సాహిత్యం, ప్రపంచ కవులు వంటి అనేక విభాగాల్లో ప్రావీణ్యం సంపాదించాడు. శక్తి చక్రాలు, కల్పాలు, మన్వంతరాలు, శరీర నిర్మాణం వంటి అంశాలపై కూడా స్పష్టమైన అవగాహన కలిగి ఉన్నాడు. కవిత్వం, కథలు చెప్పడంలోనూ నైపుణ్యం ప్రదర్శిస్తున్నాడు.సంస్కృతం, స్పానిష్ వంటి భాషలను అభ్యసిస్తున్న ఈ బాలుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఇప్పటివరకు 150 ట్రోఫీలు, 90 మెడల్స్ సాధించి, 25 "బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్"లో స్థానం సంపాదించాడు. రెండు చేతులతో సమానంగా వ్రాయగలిగే అరుదైన ప్రతిభ ఉంది. విశాఖపట్నంలోని ఇస్కాన్ సంస్థ ఈ బాలుడికి "తత్వ చైతన్య నిధి" అనే బిరుదును ప్రదానం చేసింది. అలాగే ముంబైకి చెందిన మోడల్స్ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్గా కూడా వ్యవహరిస్తున్నాడు. భవిష్యత్తులో ఇండియన్ ఫారిన్ సర్వీస్ లో చేరి దేశానికి అంబాసిడర్గా సేవ చేయాలనే లక్ష్యాన్ని ఈ బాలుడు వ్యక్తం చేశాడు.ఈ సందర్భంగా సోము వీర్రాజు బాలుడి ప్రతిభను ప్రశంసిస్తూ, ఇంత చిన్న వయస్సులో అద్భుతమైన జ్ఞాపకశక్తి, జ్ఞానం కలిగి ఉండటం ఎంతో ఆశ్చర్యకరమని పేర్కొన్నారు. ఈ బాలుడు భవిష్యత్తులో దేశానికి గర్వకారణం అవుతాడని విశ్వాసం వ్యక్తం చేశారు.
తల్లిదండ్రులు డాక్టర్ రసజ్ఞ (న్యూరో ఇమ్యునాలజీ సైంటిస్ట్), డాక్టర్ దాసరోజు శ్రీనివాసరావు కాత్యాయని పీఠంవ్యవస్థాపకులు, వాస్తు-జ్యోతిష్య పండితులు) తమ కుమారుని ప్రతిభను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని సూచించారు. అలాగే ఆధ్యాత్మిక శాస్త్రీయ రంగాల్లో మరింత ఉన్నతిని సాధించేందుకు అవసరమైన వాతావరణాన్ని కల్పించాలని ఆయన అభిప్రాయపడ్డారు.

# సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి విశిష్ట స్థానం

## వీరప్పదొర పదవీ విరమణ సన్మాన సభలో జిల్లా విద్యాశాఖ అధికారి మల్లేశ్వరరావు





**గంగవరం, పెన్ పవర్, జూన్ 7:**సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైందని, ఉపాధ్యాయ వృత్తి అత్యున్నతమైన సేవా వృత్తిగా నిలుస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి (ఏజెన్సీ) వై. మల్లేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని పెద్దగార్లపాడు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు కోసు వీరప్పదొర పదవీ విరమణ సందర్భంగా ఆదివారం నిర్వహించిన సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.దేవీపట్నం మండలం పోతవరం సంక్షేమ పాఠశాలలో విధులు నిర్వహిస్తూ మే 31న పదవీ విరమణ పొందిన వీరప్పదొరకు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ, దాదాపు 39 సంవత్సరాల పాటు విద్యాశాఖలో అంకితభావంతో సేవలందించిన వీరప్పదొర విద్యార్థుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తిలో సేవలు అందించి పదవీ విరమణ పొందడం గొప్ప అదృష్టమని, ఆయన సేవలు యువ ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.కార్యక్రమంలో వైరామవరం ఎంపీడీవో కె. బాపన్నదొర, దేవీపట్నం మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో-1) త్రిమూర్తులు పాల్గొని వీరప్పదొర విద్యా రంగానికి చేసిన సేవలను ప్రశంసించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆయన చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావం చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు కలిసి వీరప్పదొర దంపతులను ఘనంగా సత్కరించి శాలువాలు, జ్ఞాపికలు అందజేశారు. పలువురు వక్తలు ఆయన సేవా విశేషాలను గుర్తుచేసుకుంటూ అభినందనలు తెలిపారు.యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గంగవరం మండల యూటీఎఫ్ అధ్యక్షుడు కారం బుజ్జిదొర, మాజీ సర్పంచ్ కారం లక్ష్మి, పీసా ఉపాధ్యక్షుడు ఎం. చిన్నబ్బాయిదొర, వీఎస్ఎస్ చైర్మన్ మడకం పొట్టిదొర, మోహనాపురం ఆశ్రమ బాలురు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.వి.వి. సత్యనారాయణ, విశ్రాంత వైద్యాధికారి వీరబ్బాయిదొర, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు స్వామిదొర, యూనియన్ బ్యాంకు మేనేజర్ టి. బాలరాజు, డిజిటల్ అసిస్టెంట్ స్వామిదొర, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, గిరిజన సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.




02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# రంపచోడవరం సినిమా థియేటర్ దోపిడీపై చర్యలు చేపట్టాలి: సీపీఎం డిమాండ్



**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ జూన్,7:** రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలోని సినిమా థియేటర్ లో సామాన్య ప్రజలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న తినుబండారాల అక్రమ దోపిడీపై ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మరియు లీగల్ మెట్రాలజీ అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం రంపచోడవరం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ ఎం.వాణిశ్రీ డిమాండ్ చేశారు.గిరిజన ప్రజల వినోదాన్ని ఆసరాగా చేసుకుని, రంపచోడవరంలోని సినిమా థియేటర్ యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. థియేటర్ క్యాంటీన్లలో అమ్మే కూల్ డ్రింక్స్, వాటర్ బాటిల్స్, స్నాక్స్ మరియు చిప్స్ ప్యాకెట్లను ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధర కంటే రెండు, రెట్లు అదనపు ధరలకు విక్రయిస్తూ సామాన్యుల దగ్గర అధిక ధరలు వసూలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా 'డ్యూయల్ ఎమ్మార్పీ' (ఒకే వస్తువుకు రెండు ధరలు) ఉండకూడదని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఏజెన్సీ ప్రాంతంలో ఈ చట్టాలు మాకు వర్తించవనే నిర్లక్ష్యమైన రీతిలో థియేటర్ యాజమాన్యాలు బరితెగించి ప్రవర్తిస్తున్నాయి.
?సాధారణ మార్కెట్లో రూ. 20 కి దొరికే వాటర్ బాటిల్ లేదా కూల్ డ్రింక్ను థియేటర్లలో అదనపురేట్లకు అమ్ముతున్నారు. వినియోగదారుల రక్షణ చట్టం 2019 ప్రకారం ఇది ముమ్మాటికీ అక్రమ వ్యాపార పద్ధతి మరియు చట్టరీత్యా నేరం. ఏజెన్సీ ప్రాంతాల్లోని చట్టాలను, ఇక్కడి ప్రజల హక్కులను కాలరాస్తున్న ఇటువంటి థియేటర్ యాజమాన్యాలపై అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ఆమె ప్రశ్నించారు.??ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మరియు లీగల్ మెట్రాలజీ (కొలతల శాఖ) అధికారులు వెంటనే రంపచోడవరం థియేటర్ పై అకస్మాత్తుగా దాడులు నిర్వహించాలనీ
? ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువ వసూలు చేసినా లీగల్ మెట్రాలజీ నిబంధనల ప్రకారం భారీ జరిమానాలు విధించి, తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలనీ ఆమె డిమాండ్ చేశారు.?నిరంతరాయంగా అక్రమాలకు పాల్పడుతున్న థియేటర్ లైసెన్స్ను తక్షణమే రద్దు చేయాలి.థియేటర్ క్యాంటీన్ వద్ద ప్రభుత్వ నిబంధనల ప్రకారం వస్తువుల అసలు ధరల పట్టికను ప్రజలకు కనిపించేలా ఏర్పాటు చెయ్యాలి. మరియు ప్రతి కొనుగోలుకు పక్కా బిల్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.?ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులను దోపిడీ చేస్తూ లాభాలు గడపాలని చూస్తే సిపిఎం చూస్తూ ఊరుకోదనీ, అధికారులు స్పందించి వెంటనే రంపచోడవరం థియేటర్ లో జరుగుతున్న ఈ దోపిడీని తక్షణమే అరికట్టలని సీపీఎం ప్రాంతీయ కమిటీగా ఆమె డిమాండ్ చేశారు.

# తెలుగు భాషా వికాసానికి చట్టబద్ధతకు కృషి

## 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో సాంస్కృతిక శాఖ మంత్రి దుర్గేష్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 7:**తెలుగు భాషా వికాసానికి చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని త్వరలోనే నంది నాటకోత్సవాలు నిర్వహిస్తామని అందిస్తామని
రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు
పద్యనాటకం, అవధానాలు తెలుగువారికే సొంతమైన అద్భుత ప్రక్రియలను కాపాడుకుందామని మంత్రి కందుల దుర్గేష్ పిలుపు నిచ్చారు.
గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ వేదికగా చైతన్య సారస్వత పరిషత్ సౌజన్యంతో, శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల ముగింపు వేడుకల్లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జూన్ 6, 7 తేదీల్లో తెలుగు భాష, సాహిత్య సంస్కృతుల సమ్మేళనం, సాహితీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సభలో పాల్గొన్న కవులు, రచయితలకు మంత్రి దుర్గేష్ కళాభివందనాలు తెలిపారు.
ఈ సందర్భంగా సభను ఉద్దేశించి మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, మాతృభాష తల్లి పాలు వంటిదని, ఆంగ్ల భాష పోత పాలు వంటిదన్నారు. కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ల ఆధ్వర్యంలో ఆంగ్ల భాష, జాతీయ భాష హిందీలకు పెద్దపీట వేస్తూనే, ప్రాథమిక విద్యాబోధన మాతృభాషను తప్పనిసరి చేసిందన్నారు. ' అంతర్జాతీయ ఖ్యాతి గడించిన కూచిపూడి నృత్యం సంస్కృతికి చిహ్నమని, చిన్నారుల ప్రదర్శనలను అభినందించారు. ఈ గడ్డకు కళా, సాంస్కృతిక వైభవం ఉందన్నారు. భాషా వికాసం కోసం శ్రమిస్తున్న నిర్వాహకులు, మాజీ ఎమ్మెల్సీ, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఛాన్సలర్, కేవీవీ సత్యనారాయణ రాజు(చైతన్యరాజు)ను మంత్రి అభినందించారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని 'తెలుగు భాషా దినోత్సవాన్ని' నిర్వహించామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతిష్టాత్మకంగా 'నంది నాటకోత్సవాలు' నిర్వహిస్తామని, నంది అవార్డులను అందిస్తామన్నారు.

# సిరిగిందలపాడులో రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం







**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 7:**రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల, రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ఆదివారం రంపచోడవరం మండలం సిరిగిందలపాడు గ్రామంలో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 150 మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు ఆయన పేర్కొన్నారు. డాక్టర్ దాసరి ఉమామహేష్, డాక్టర్ శ్రీనివాస్ రాయుడు, డాక్టర్ పావని ప్రియల బృందం రోగులను పరీక్షించి అవసరమైన వైద్య సలహాలు, చికిత్స అందించారు.శిబిరంలో 59 మందికి రక్తపరీక్షలు, నలుగురికి థైరాయిడ్ పరీక్షలు, ఆరుగురికి ఎక్స్రే పరీక్షలు నిర్వహించగా, 13 మందికి ఫిజియోథెరపీ సేవలు అందించినట్లు స్వామీజీ తెలిపారు. అలాగే శిబిరానికి హాజరైన రోగులు, వారి సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ సిబ్బంది, వైద్య సేవల సమన్వయకర్త కానుమోను శ్రీనివాస్, వాలంటీర్ దాసరి పెద్ద అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# మిరియాల వెంకట రెడ్డి పంతుల సత్రం నూతన చైర్మన్‌గా మట్టా నాగేశ్వరరావు నియామకం..





- ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కి కృతజ్ఞతలు తెలిపిన ఎన్డీయే కూటమి నాయకులు..
- సత్రం ఆశయాల సాధనకు, భక్తుల సేవకు కట్టుబడి ఉంటాం

**కోరుకొండ, పెన్ పవర్, జూన్ 7:** కోరుకొండ మండలానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన శ్రీ వి.వి. రెడ్డి పంతుల సత్రం నూతన చైర్మన్‌గా బిసి సామాజిక వర్గానికి చెందిన జనసేన పార్టీ నాయకులు మట్టా నాగేశ్వరరావు నియామకం కావడం పట్ల ఎన్డీయే కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా జనసేన జిల్లా జాయింట్ సెక్రెటరీ మేడిశెట్టి శివరామ్ మాట్లాడుతూ.. గతంలో ఈ సత్రానికి సంబంధించి 130 ఎకరాల భూమిని నిత్య అన్నదాన కార్యక్రమాల కోసం కేటాయించడం జరిగిందని గుర్తుచేశారు. అయితే గత కొంతకాలంగా ఇవి సక్రమంగా అమలు కాకపోవడంతో కోరుకొండ మండల ప్రజలు, భక్తులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజనగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఈ సమస్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని తెలిపారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి తీర్థం రోజుల్లో సత్రం ద్వారా ఐదు రోజుల పాటు జరగాల్సిన అన్నదాన కార్యక్రమాన్ని సక్రమంగా, ఘనంగా నిర్వహించేలా ఎమ్మెల్యే చర్యలు తీసుకున్నారన్నారు. అందులో భాగంగానే ఈ రోజు జనసేన పార్టీ తరపున బిసి సామాజిక వర్గ నేత మట్టా నాగేశ్వరరావు ని చైర్మన్‌గా నియమించడం చాలా సంతోషకరమన్నారు.
ఈ మంచి నిర్ణయం తీసుకున్నందుకు ఎమ్మెల్యే బత్తుల కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వి.వి. రెడ్డి పంతుల ఆశయాలకు అనుగుణంగా, జనసేన పార్టీ మరియు ఎన్డీయే కూటమి తరపున సత్రం ద్వారా భక్తులకు మెరుగైన సేవలందేలా నూతన కమిటీ కృషి చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్లు పసుపులేటి శివ వాతాడ గోపికృష్ణ, తాటికొండ మృత్యుంజయ రావు, చింతపెంట రామచంద్రరావు ధనాలకోట లక్ష్మి ఆదివరపు మంగాదేవి తగరంపూడి నాగవేణి సభ్యులుకు కూడా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు అడ్డాల శ్రీను, సీనియర్ నాయకులు అడపా శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు బదిరెడ్డి దొర, కర్రీ గణేష్, ముక్కా రాంబాబు, మేడిశెట్టి శివరామ్, కర్రీ దొరబాబు, మారిశెట్టి త్రిమూర్తులు, తన్నేరు తాతాజీ, చదువు ముక్తేశ్వరరావు, వీరప్పరాజు పోసుబాబు, మంచాల శామ్యూల్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ బీచ్‌లో శుభ్రత కార్యక్రమం







**కాకినాడ రూరల్, పెన్ పవర్ జూన్ 7:** కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పిలుపు మేరకు ఆల్ ఈజ్ వెల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ బీచ్‌లో ఆదివారం ఉదయం శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ చేపడుతున్న వారాంత సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ బీచ్ క్లీనింగ్ డ్రైవ్‌ను నిర్వహించారు.
ఉదయం 6 గంటలకు ఎన్టీఆర్ బీచ్‌కు చేరుకున్న ఆల్ ఈజ్ వెల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవకులు "3 గంటలు సమాజ సేవ" నినాదంతో బీచ్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పాల్గొని స్వయంగా చెత్తను ఏరి స్వచ్ఛంద సేవకులను ప్రోత్సహించారు. అనంతరం బీచ్‌లో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారితో సమావేశమై, వ్యాపార వ్యర్థాల వల్ల బీచ్ మరియు సముద్ర జలాలు కలుషిత మవుతున్నాయని తెలిపారు. బీచ్‌లో అనధికారికంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తొలగించాలని హెచ్చరిస్తూ, బీచ్ పరిశుభ్రత పరిరక్షణలో వ్యాపారులు, పర్యాటకులు తమ బాధ్యతను నిర్వర్తించాలని కోరారు.
ఆల్ ఈజ్ వెల్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎన్. కిషోర్ కుమార్ మాట్లాడుతూ బీచ్‌లో ప్లాస్టిక్ స్పూన్లు, వాటర్ ప్యాకెట్లు, మద్యం సీసాలు, ఐస్‌క్రీమ్ కప్పులు, డిస్పోజబుల్ గ్లాసులు, చిన్నారుల డైపర్లు, పాత బట్టలు, చెప్పులు వంటి వ్యర్థాలు పెద్దఎత్తున కనిపిస్తున్నాయని తెలిపారు. స్వచ్ఛంద సేవకులు,పంచాయతీ సిబ్బంది తరచూ శుభ్రత కార్యక్రమాలు చేపడుతున్న ప్పటికీ, పర్యాటకుల నిర్లక్ష్య ధోరణి వల్ల బీచ్ మళ్లీ అపరిశుభ్రంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సేకరించిన చెత్తలో సుమారు 60 శాతం రీసైక్లింగ్‌కు అనువైన ప్లాస్టిక్, గాజు సీసాలు, కాగితాలను వేరు చేసి ఎంఆర్ఎఫ్ (మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ) కేంద్రానికి తరలించారు. మిగిలిన 40 శాతం రీసైక్లింగ్‌కు అనువుకాని వ్యర్థాలను పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్ ద్వారా తరలించారు.
ఈ కార్యక్రమంలో అటవీ శాఖ,రెవెన్యూ శాఖ,పంచాయతీ సిబ్బంది, ఏఐడబ్ల్యూసీ మహిళా సభ్యులు, స్వచ్ఛంద సేవకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు 'స్టాప్, వాష్ అండ్ గో' కార్యక్రమం





**కాకినాడ, పెన్ పవర్ జూన్ 7:** రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే లక్ష్యంతో కాకినాడ జిల్లా పోలీసులు కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద 'స్టాప్, వాష్ అండ్ గో' (ఫేస్ వాష్) మరియు డ్రంక్ అండ్ డ్రైవ్ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు జూన్ 6, 7 తేదీల రాత్రి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎన్. రమేష్, ఎస్ఐ కిర్లంపూడి మరియు సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రాత్రి, తెల్లవారుజామున ప్రయాణించే వాహనదారులు అలసట లేదా నిద్రమత్తు కారణంగా ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకు 'స్టాప్, వాష్ అండ్ గో' కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహనదారులకు ముఖం కడుక్కొని, కొంతసేపు విశ్రాంతి తీసుకుని ప్రయాణాన్ని కొనసాగించాలని సూచించారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. నిద్రమత్తులో డ్రైవింగ్ చేయడం ఎంత ప్రమాదకరమో వివరించి, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్ ప్రారంభించే ముందు తగిన విశ్రాంతి తీసుకోవాలని, అధిక వేగంతో లేదా నిర్లక్ష్యంగా వాహనాలు నడపరాదని సూచించారు. అదేవిధంగా హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని, తక్కువ దూరం ప్రయాణం అయినప్పటికీ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. వన్‌వే రహదారుల్లో నిబంధనలు ఉల్లంఘించి ప్రయాణించవద్దని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని హెచ్చరించారు. "మీపై మీ కుటుంబం ఆధారపడి ఉందని గుర్తుంచుకోండి. ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా మీ గమ్యస్థానానికి చేరుకోండి" అని పోలీసులు వాహనదారులకు విజ్ఞప్తి చేశారు.

# ఆహార భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత



**కాకినాడ, పెన్ పవర్ జూన్ 7:** ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం సందర్భంగా స్థానిక అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రముఖ దంత వైద్యులు డా. అడ్డాల సత్యనారాయణ ఆహార భద్రత ప్రాముఖ్యతపై ప్రసంగించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం జూన్ 7న ప్రపంచ వ్యాప్తంగా "ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం" జరుపుకుంటారని తెలిపారు. ప్రజలు తీసుకునే ఆహారం సురక్షితంగా ఉండేలా చూడడం,కలుషిత ఆహారం వల్ల వచ్చే వ్యాధులను నివారించడం,ఆహార భద్రతపై అవగాహన పెంపొందించడమే ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఐక్యరాజ్యసమితి ఆహార మరియు వ్యవసాయ సంస్థ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రపంచవ్యాప్తంగా పర్యవేక్షిస్తున్నాయని చెప్పారు. ఈ ఏడాది ఆహార భద్రతా దినోత్సవం థీమ్ కలుషిత ఆహారం వల్ల కలిగే అనారోగ్యాలు,మరణాలకు సంబంధించిన సమాచారాన్ని విశ్లేషించి, వాటి నివారణకు తక్కువ ఖర్చుతో కూడిన సమర్థవంతమైన పరిష్కారాలను కనుగొనడంపై దృష్టి సారించిందని వివరించారు. కలుషిత ఆహారంలో ఉండే హానికరమైన బ్యాక్టీరియా,వైరస్‌లు,పరాన్నజీవులు, రసాయనాల కారణంగా డయేరియా నుంచి క్యాన్సర్ వరకు 200కు పైగా రకాల వ్యాధులు సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆహార భద్రత అనేది ప్రభుత్వాలు లేదా సంస్థల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆహారం తయారు చేయడానికి ముందు, భోజనం చేసే ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని,వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మాంసం, గుడ్లు, చికెన్ వంటి ఆహార పదార్థాలను పూర్తిగా ఉడికించి తీసుకోవాలని,సరైన ఉష్ణోగ్రత వల్ల హానికరమైన బ్యాక్టీరియా నశిస్తుందని తెలిపారు. వంటకు స్వచ్ఛమైన నీటిని ఉపయోగించడంతో పాటు తాజా కూరగాయలు,పండ్లను బాగా కడిగి వినియోగించాలని సూచించారు. పొలం నుంచి భోజన పళ్లెం వరకు ఆహారం ప్రయాణించే ప్రతి దశలోనూ బ్యాక్టీరియా, వైరస్‌లు, రసాయనాల కలుషితానికి గురికాకుండా శుభ్రంగా ఉండటమే నిజమైన ఆహార భద్రత అని డా. అడ్డాల సత్యనారాయణ వివరించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమం






**కాకినాడ, పెన్ పవర్,జూన్ 7:** ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా కాకినాడ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం "సండేస్ ఆన్ సైకిల్" కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు,సిబ్బంది,యువత మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్,ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్పీ స్వయంగా పాల్గొని సైక్లింగ్ ప్రాముఖ్యతను వివరించారు. సైక్లింగ్‌ను రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు కూడా తోడ్పడవచ్చని తెలిపారు. యువతతో పాటు అన్ని వయస్సుల ప్రజలు సైక్లింగ్‌ను అలవాటు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కాకినాడలో నిర్వహించిన కార్యక్రమంలో కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి దేవరాజ్ మనీష్ పాటిల్,ఎస్‌బీ డీఎస్పీ కె.వి.వి.సత్యనారాయణ,రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ సీఐ వి.శ్రీనివాసరావు,వివిధ పోలీస్ స్టేషన్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. పెద్దాపురం సబ్ డివిజన్ పరిధిలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఏ.బి.జి.తిలక్ నేతృత్వంలో పెద్దాపురం, సామర్లకోట ప్రాంతాల్లో సైకిల్ ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట సీఐ ఆళ్ల కృష్ణ భగవాన్, ఎస్ఐలు మూర్తి, గరగారావు, రాజా, పెద్దాపురం సీసీఎస్ సీఐ అంకబాబు, ఎస్ఐ మౌనిక, ప్రత్తిపాడు సీఐ బి. సూరి అప్పారావు, ఉమెన్ ఎస్ఐ ఎస్. లక్ష్మీకాంతం, జగ్గంపేట ఎస్ఐ టి. రఘునాథరావు తదితర అధికారులు, సిబ్బంది, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల్లో ఆరోగ్య అవగాహన, ఫిట్‌నెస్ పట్ల ఆసక్తి, పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కలిగించడంలో విజయవంతమైందని అధికారులు తెలిపారు.

# రాజ్యసభకు రెండోసారి ఎంపికైన సానా సతీష్‌బాబుకు శుభాకాంక్షలు



డా. అడ్డాల సత్యనారాయణ

**కాకినాడ, పెన్ పవర్ జూన్ 7:** రాజ్యసభ సభ్యునిగా రెండోసారి ఎంపికైన సానా సతీష్‌బాబుకు ప్రముఖ దంత వైద్య నిపుణుడు డా.అడ్డాల సత్యనారాయణ శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక శ్రీ సత్య దంత వైద్యశాలలో నిర్వహించిన సమావేశంలో డా.అడ్డాల మాట్లాడుతూ,తన బాల్య మిత్రుడు సానా సతీష్‌బాబుకు మరోసారి రాజ్యసభ సభ్యునిగా అవకాశం కల్పించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.
2026--2032 కాలానికి రాజ్యసభ సభ్యునిగా ఎంపికైన సానా సతీష్‌బాబు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే కాకినాడ పార్లమెంట్ పరిధి ప్రజలకు మరింత సేవలందించాలని కోరారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ,పేదలకు వైద్య సహాయం, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రజాసేవలో ఆయన అంకితభావం అభినందనీయమని పేర్కొన్నారు. కాకినాడ ప్రాంత అభివృద్ధికి మరింత కృషి చేస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ముందుకు సాగాలని సానా సతీష్‌బాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

# నేడు కాకినాడలో పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు

**కాకినాడ, పెన్ పవర్,జూన్ 7 :** జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) మరియు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు జూన్ 8న యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు.
సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కాకినాడ కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో పీజీఆర్ఎస్ కార్యక్రమం, వివేకానంద హాలులో రెవెన్యూ క్లినిక్ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాస్థాయి అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు,వినతి పత్రాలను సమర్పించి పరిష్కారం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే సమర్పించిన అర్జీలు పరిష్కారం కాకపోయినా లేదా వాటి స్థితిగతులు తెలుసుకోవాలన్నా 1100 కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవచ్చన్నారు.
అలాగే అర్జీదారులు తమ ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు "మీకోసం" పోర్టల్ ద్వారా అవకాశం కల్పించబడిందని తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిల్లో కూడా ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను సమీపంలోని డివిజన్, మండల లేదా మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించి పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# కాక్రోచ్ జనతా పార్టీకి బీజేపీ ఫస్ట్ వార్నింగ్! విదేశీ కుట్రలపై నితిన్ నబిన్ నిప్పులు.. అసలేం జరుగుతోంది?

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత రాజకీయాల్లో సంచలన వ్యాఖ్యలకు కేరాఫ్ అడ్రస్‌గా మారారు బీజేపీ కొత్త జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్. జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా జార్ఖండ్‌లో పర్యటిస్తున్న ఆయన, రాంచీలో జరిగిన మేధావుల సదస్సులో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా పెను దుమారం రేపుతున్నాయి. విపక్షాలను, దేశ వ్యతిరేక శక్తులను ఉద్దేశించి ఆయన ఉచ్ఛరించిన 'కాక్రోచ్ జనతా పార్టీ' అనే పదం ఇప్పుడు పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్ అవుతోంది.

**యువతపై విదేశీ శక్తుల కన్ను**

రాంచీ వేదికగా నితిన్ నబిన్ దేశ యువతను అలర్ట్ చేస్తూ సంచలన ఆరోపణలు చేశారు. 'దేశానికి లభించిన అతిపెద్ద బలం ఇక్కడి యువశక్తి. కానీ, కొందరు విదేశాల్లో కూర్చుని డిజిటల్ మాధ్యమాల ద్వారా మన యువతను బ్రెయిన్ వాష్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వారి తలల్లోకి దేశ వ్యతిరేక భావజాలాన్ని నూరిపోస్తూ, ప్రతికూల రాజకీయాల వైపు మళ్లించేందుకు కుట్రలు పన్నుతున్నారు' అని నబిన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే భారత యువత అంత అమాయకులేం కాదని, తమ భవిష్యత్తును తామే నిర్మించుకునే దిశగా సానుకూల రాజకీయాల వైపే మొగ్గు చూపుతారని ఆయన స్పష్టం చేశారు. యువత ఎవరి చేతుల్లోనూ చెప్పుచేతల్లో ఉండే బొమ్మలు కాదని హెచ్చరిస్తూ, విదేశీ శక్తుల కుట్రలను ప్రజాస్వామ్యబద్ధంగానే తిప్పికొడతామని తేల్చి చెప్పారు.

**రైతులకు రెట్టింపు భరోసా**

కేవలం రాజకీయాలే కాకుండా దేశాభివృద్ధిలో రైతుల పాత్రను నబిన్ ప్రత్యేకంగా కొనియాడారు. రైతు సంతోషంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది. అన్నదాతలను కేవలం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా చూడటం మా పద్ధతి కాదు. వారి ఆదాయాన్ని రెట్టింపు చేయడమే మోదీ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెబుతూ వ్యవసాయ రంగానికి బీజేపీ ఇస్తున్న ప్రాధాన్యతను పునరుద్ఘాటించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# స్టేట్ పాలిటిక్స్‌కే షర్మిల పరిమితమా ..!



**హైదరాబాద్ పెన్ పవర్:**కాంగ్రెస్ పార్టీ ఏపీ అధ్యక్షురాలు.. వైఎస్ షర్మిల రాష్ట్ర రాజకీయాలకే పరిమితం కానున్నారా? ఆమె ఆశిం చిన రాజ్యసభ సీటు దక్కడం ఇప్పట్లో సాధ్యంకాదా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. తాజాగా కర్ణాటక నుంచి రాజ్యసభలో వైఎస్ షర్మిల అడుగు పెడతారని.. దాదాపు పుష్కర కాలం తర్వాత.. పార్లమెం టులో వైఎస్‌కుటుంబం అడుగు పెడుతుందని.. గళం వినిపిస్తుందని భావించిన వారికి కాంగ్రెస్ అధిష్టా నం భారీ షాకే ఇచ్చింది.వాస్తవానికి షర్మిల రాజ్యసభలో అడుగు పెట్టాలనేది 2019 ఎన్నికల తర్వాత రాజకీయంగా చర్చనీయాం శంగా మారింది. అప్పట్లో వైసీపీ తరపున ఆమె రాజ్యసభలో అడుగు పెట్టాలని భావించారు. కానీ జగన్ ఆమెకు అవకాశం ఇవ్వలేదు. దీంతో 2021లో తెలంగాణలో సొంత పార్టీ పెట్టుకున్నారు. ఆ తర్వాత అక్కడ సక్సెస్ కాలేకపోవడంతో దానిని కాంగ్రెస్లో విలీనం చేసి ఏపీలో ఆ పార్టీ పగ్గాలు చేపట్టారు. దీంతో మంచి గుర్తింపు లభిస్తుందని పార్లమెంట్‌లో అడుగు పెట్టాలని షర్మిల అంచనా వేసుకున్నారు.ఈ క్రమంలోనే 2024 ఎన్నికల్లో కడప నుంచి పోటీ చేశారు. కానీ పరాజయం పాలయ్యారు. ఇక అప్పటినుంచి ఆమె రాజ్యసభ సీటు కోసం ఎదురుచూస్తున్నారు. కర్ణాటకకు చెందిన కీలక నాయకులతో సిఫారసు కూడా చేయించుకున్నారు. దీంతో ఇటీవల పార్టీ అధిష్టానం షర్మిలను ఢిల్లీకి ఆహ్వానించి ఈ వ్యవహారం పై చర్చించింది. ఫలితంగా ఇక రాజ్యసభలో అడుగుపెడతారని రాజకీయ వర్గాల్లో చర్చ నడిచింది. కానీ అనూహ్యంగా కర్ణాటక నుంచి కాంగ్రెస్‌కు లభించే మూడు స్థానాల్లో కూడా షర్మిలకు అవకాశం దక్కలేదు.దీంతో ఇప్పుడు ఆమె తీవ్రంగా అవేదనలో కూరుకుపోయారు. అంతేకాదు ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో షర్మిల ఏపీకే పరిమితం కావాల్సిన పరిస్థితి కూడా ఏర్పడింది. దీంతో ఆమె ఏ విధంగా స్పందిస్తారు.. పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ఏ మేరకు కృషి చేస్తారు.. అనేది చూడాలి. ప్రస్తుతం ఉన్న రాజకీయ వర్గాల్లో షర్మిల ఫైర్ బ్రాండ్ గా మారారు. ముఖ్యంగా వైసీపీని టార్గెట్ చేయడంలో ఆమె బలమైన నాయకురాలుగా ఎదిగారు అనే చెప్పాలి.ప్రస్తుతం టిడిపి చేస్తున్న –గొడ్డలి పార్టీ– అనే విమర్శ వెనుక షర్మిల ఇచ్చిన నినాదమే కారణమని చెప్పాలి. కొన్నాళ్ల కిందట షర్మిల మాట్లాడుతూ.. కడప జిల్లాకు –అవి గొడ్డలి– అని పేరు పెట్టుకోవాలని వైసీపీకి పిలుపునిచ్చారు. అనంతరం టిడిపి దీనిని అందిపుచ్చుకొని గొడ్డలి పార్టీగా ప్రచారం చేసింది. ఇలా షర్మిల వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు.

అయితే ఈ క్రమంలో రాజ్యసభ సీటు గనక ఇచ్చి ఉంటే ఆమెకు మరింత బలం చేకూరేదన్న వాదన వినిపిస్తోంది. కానీ, పార్టీ మాత్రం తాజాగా ఆమెకు షాక్ ఇచ్చిందని చెప్పాలి. మరి ఈ షాక్ నుంచి తేరుకుని ఆమె పార్టీ కోసం పని చేస్తారా? లేకపోతే మౌనంగా ఉంటారా? వచ్చే ఎన్నికల దాకా వేచి చూస్తారా? అనేది చూడాలి.

# టీడీపీలో తూర్పు గాలి... సీనియర్లకు అర్థం కావాలి !

**హైదరాబాద్ పెన్ పవర్:**తూర్పు అంటే మార్పు. తూర్పు అంటే వేకువ. తూర్పు అంటే అరుణోదయం. కొత్త ఆవిష్కరణ. నూతనమైన రోజు పుట్టుక. ఇలా ఎన్నో చెప్పుకోవచ్చు. ఇపుడు టీడీపీలో కూడా తూర్పు గాలి బలంగా వీస్తోంది అంటే కొత్త ఉషస్సు కోసం చూస్తోంది. నవ శక్తిని యువ శక్తిని కలిపి పట్టం కడుతోంది. తాజాదనానికి నూతనత్వానికి అగ్ర తాంబూలం అందిస్తోంది. తెలుగుదేశంలో మొదలైన ఈ పరిణామ క్రమం అయితే అనివార్యం. ఇది జరిగి తీరాల్సిందే. ఒక రాజకీయ పార్టీ తన దశ దిశను ఎప్పటికప్పుడు మార్చుకోవాల్సి ఉంటుంది. కాలానికి ఎవరూ ఎదురీదలేరు. కాలం తెచ్చే మార్పులు చేదుగా ఉన్నా స్వీకరించాల్సిందే. టీడీపీలో ఇపుడు కొత్త పూత పూస్తోంది.

**అంటే పాత రోతని కాదు, కాస్తా పక్కకు తొలగమని మాత్రమే అర్థం.**

**సీనియర్లకు బ్యాక్ బెంచ్ :**

ఒక రాజకీయ పార్టీ ఎన్నో సార్లు ఎందరికో అవకాశం ఇస్తోంది. అలా ఇవ్వడం కేవలం భారతీయ రాజకీయాల్లోనే ఎక్కువగా కనిపిస్తోంది. అందుకే మన దగ్గర వృద్ధ నాయకత్వం ఉంటుంది.రెండున్నర లక్షల జనాభాకు ఒకరు ఎమ్మెల్యే అవుతారు. ఇరవై లక్షల జనాభాకు ఒకరు ఎంపీ అవుతారు. ఇక మంత్రి అయ్యేవారు కనీసంగా పాతిక లక్షల మందిలో ఒకరే ఉంటారు. ఇవన్నీ రాజకీయ గణితాలు. జాతకాలు నమ్మినా నమ్మకపోయినా ఈ గణితాన్ని ఫాలో కావాల్సిందే. ఇక చూస్తే దేశంలో ట్రెడిషనల్ పార్టీలు అనేకం ఉన్నాయి. అవి ఒక అభ్యర్థికే పదే పదే అవకాశాలు ఇస్తూ పోతూంటాయి. దాని వల్ల ఆయా నియోజకవర్గాలలోనే చాలా మంది జెండా మోసి ముసలివారు అయిపోతున్నారు. చాన్స్ మాత్రం దక్కడం లేదు. ఎట్టకేలకు టీడీపీ ఈ సత్యం తెలుసుకుంది. మార్పు కనిపిస్తోంది. దాంతో సీనియర్లకు బ్యాక్ బెంచ్ చూపిస్తోంది.

**ఏ పదవి అయినా సరే :**

టీడీపీలో ఏ పదవి అయినా సరే ఇక మీదట కొత్త వారికే దక్కుతుంది. అలాగే యువతకే పెద్ద పీట వేస్తారు. అదే విధంగా జనాలకు న్యూ ఫేస్ చూపిస్తుంది. ఆ తాజాదనమే పార్టీకి ఎనలేని ధనంగా మారి మరిన్ని దశాబ్దాల పాటు పార్టీ ప్రగతి దారులలో పయనిస్తుందని నమ్ముతోంది. దాంతో అది ఎమ్మెల్యే అయినా మంత్రి అయినా ఎంపీ అయినా రాజ్యసభకు అయినా యూత్ కే టీడీపీ ప్రయారిటీ ఇస్తోంది. తాజాగా టీడీపీలో రాజ్యసభ సభ్యుల ఎంపిక అలాగే జరిగింది. దాంతో సీనియర్లు ఖంగు తింటున్నారు అని వార్తలు వస్తున్నాయి. కానీ ఈ పరిణామ క్రమం అన్నది 2024 నుంచే మొదలైంది. అది ఇప్పటికే వారికి అలవాటు కావాలని కూడా అంటున్న వారూ ఉన్నారు.

**వీరంతా ఆశించినా :**

ఇక టీడీపీకి తాజాగా మూడు రాజ్యసభ సీట్లు ఉంటే దాని కోసం పెద్ద ఎత్తున పోటీ జరిగింది. ఆ లిస్ట్ చూస్తే మాజీ ఎంపీలు గల్లా జయదేవ్, కంభంపాటి రామ్మోహన్ రావు, యనమల రామకృష్ణుడు, వర్ల రామయ్య వంటి ఉన్నారు. వీరంతా రాజ్యసభకు వెళ్ళాలని ఉత్సాహం చూపించారు. కానీ టీడీపీ లిస్ట్ చూస్తే సీనియారిటీకి నో చాన్స్ అని తేలిపోయింది ఇది పార్టీకి మంచిదని అంతా అంటున్నారు. అయితే సీనియర్లు మాత్రం నొచ్చుకుంటున్నారు. తమకు లేదా అవకాశం అని మధన పడుతున్నారు. అది సహజమైన పరిణామం. కానీ ఎవరూ చేయగలిగింది అయితే లేదు టీడీపీ ఒక విధానం పెట్టుకుని ముందుకు సాగుతోంది. నాలుగున్నర దశాబ్దాల టీడీపీ కొత్త రెక్కలు తొడుక్కోవాలని చూస్తోంది. కొత్త నీరుని ఆహ్వానిస్తోంది. అందుకే ఈ ఎంపికలు అని అంటున్నారు సీనియర్లు ఆశించడంలో తప్పు కాదు కానీ ఆవేదన చెందడంలోనే ఉంది అని అంటున్నారు. టీడీపీలో మారుతున్న గాలిని అర్థం చేసుకోవాల్సి ఉందని కూడా అంటున్నారు. ఇదిలా ఉంటే పార్టీ ఏపీ ప్రెసిడెంట్ పల్లా శ్రీనివాసరావు ఆశావహులకు స్వయంగా ఫోన్లు చేసి సర్ది చెబుతున్నారని భోగట్టా.

# జగన్ కి రావాల్సిన కోపం ఆయనకు వచ్చింది ?

**హైదరాబాద్ పెన్ పవర్:**వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్ కి కోపం రావాలి. సహజంగా అదే జరగాలి. కానీ ఆయనకు కాకుండా వేరే ఆయనకు కోపం వచ్చింది. అసలు జగన్ కి ఎందుకు కోపం రావాలి ఆయనకు ఎందుకు వచ్చింది ఏమిటి ఇదంతా అంటే అదంతా ఒక రాజకీయ సిత్రం మరి. ఈ నెల 2న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ హైదరాబాద్ లో తన ఇంట్లో ఒక కీలకమైన ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ ప్రెస్ మీట్ లో ఆయన ఇప్పటికి 17 ఏళ్ళ క్రితం మరణించిన వైఎస్సార్ ప్రస్తావన తెచ్చారు. ఆయన మాట మీద ఒక పోలీసు అధికారి తన వద్దకు వచ్చి తాను గానీ తన అన్న గారు చిరంజీవి కానీ రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన ఉందో లేదో ఆరా తీశారు అని చెప్పారు. అంతే కాదు ప్రభుత్వం నుంచి మీకు ఒత్తిళ్ళు ఉంటాయని చెప్పారని కూడా పవన్ చెప్పారు. ఆ తరువాతనే తనకు కొన్ని రాజకీయ ఒత్తిళ్ళు కూడా మొదలయ్యాయని వాటి కారణంగానే తాను రాజకీయాల్లోకి రావడం జరిగిందని చెప్పరు. అంటే వైఎస్సార్ తన మీద కేసులు పెట్టాలని చూశారని అన్నట్లుగా పవన్ చెప్పేశారు అన్న మాట.



**వైఎస్సార్ పేరుతో పార్టీ :**

మరి ఈ విధంగా దివంగత నేత మీద తన తండ్రి మీద పవన్ చేసిన ఆరోపణలకు స్పందించాల్సింది ఆయన పేరుతో పార్టీ నడుపుతూ ఆయన రాజకీయ వారసత్వాన్ని పుచ్చుకుని ఒకసారి ముఖ్యమంత్రి అయి ఈ రోజుకీ 40 శాతం ఓటు షేర్ తో పార్టీని నడుపుతున్న వైఎస్ జగన్ కదా అని అంతా అంటున్నారు నిజమే వైఎస్సార్ ప్రస్తావన తెచ్చినపుడు జగన్ తప్పకుండా రియాక్ట్ కావాలని ఆయన అభిమానులూ అంటున్నారు. పోనీ జగన్ కాకపోయినా వైసీపీ పార్టీ అయినా రియాక్ట్ కావాలి కదా అన్న వారూ ఉన్నారు. వైసీపీలో అంబటి రాంబాబు లాంటి వైఎస్సార్ వీరాభిమానులు ఎందరో ఉన్నారు. కానీ ఎవరూ పవన్ స్పీచ్ మీద అయితే ఎక్కడా స్పందించలేదు. పైగా తెలంగాణా వాదులు పవన్ ని కౌంటర్ చేస్తే వాటిని వైసీపీ సొంత చానల్ ప్రాజెక్ట్ చేసింది. వాటి మీదనే టీవీ డిబేట్లు పెట్టారు. మరి ఎందుకు అలా అంటే ఆలోచించాల్సిందే అంటున్నారు.

**కేవీపీ రంగంలోకి :**

అయితే ఇది జరిగిన రెండు మూడు రోజులకు కేవీపీ రామచంద్రరావు రెస్పాండ్ అయ్యారు. అది కూడా ఘాటుగానే. వైఎస్సార్ ని అనవసరంగా నిందిస్తారా అని పవన్ మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ మీద కేసులు పెడతాను అన్న ఆ పోలీసు అధికారి ఎవరో పేరు చెప్పమని కూడా డిమాండ్ చేశారు. ఆయనకు లై డిటెక్టర్ టెస్టు చేయించాలని అన్నారు. ఒకవేళ సదరు పోలీసు అధికారి అలా చెబితే తాను వైఎస్సార్ అభిమానులు పది లక్షలు పోగు చేసి స్వచ్ఛంద సంస్థలకు విరాళంగా ఇస్తామని కూడా చెప్పారు. వైఎస్సార్ ఆనాడు ఎంతో ప్రజాదరణతో వెలిగిపోతున్నారని ఆయన సీఎం గా ఉన్నపుడు పవన్ రాజకీయాల్లోనే లేరని హీరోగా ఉన్నారని కూడా గుర్తు చేశారు.

**నీడగా ఆత్మగా తన కర్తవ్యం :**

మరి ఇంతలా కేవీపీ వైఎస్సార్ ని సపోర్ట్ చేస్తూ పవన్ కి ఒక బహిరంగ లేఖ రాసి ఆయన తోడుగా నీడగా ఆత్మగా తన కర్తవ్యం నిర్వహించారు అనుకుంటే మరి ఆయన రాజకీయ వారసులు ఏమైపోయారు అన్న ప్రశ్న జనంలోనూ వైఎస్సార్ అభిమాన జనంలోనూ వస్తోంది. వైఎస్సార్ కుమారుడూ కుమార్తె కూడా రాజకీయాల్లో ఉన్నారని కూడా గుర్తు చేస్తున్నారు మరి పవన్ అన్న మాటలు అయితే తేలిగ్గా తీసేయాల్సినవి కావు. ఒత్తిళ్ళు తెచ్చి కేసులు పెట్టాలనుకున్నారని ఆయన చేసిన తీవ్రమైన ఆరోపణలకు జవాబు ఇచ్చుకునే స్థితిలో వైఎస్సార్ అయితే లేరు, ఆయన దివంగతులు అయ్యారు. మరి ఏమైనా రియాక్ట్ కావాలంటే సొంత కుటుంబీకులే కదా అని అంటున్నారు. ఆ పని కేవీపీ చేశారు అంటే వైఎస్సార్ కి ఆత్మ బంధువు ఎవరో అర్ధమవుతోంది కదా అన్న కామెంట్స్ కూడా వినవస్తున్నాయి.

# సైకిల్ పై చలోచలో.. చంద్రబాబు వినూత్న కార్యక్రమం!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మరో భారీ పొలిటికల్ క్యాంపెయిన్‌కు తెరలేపింది. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి కావస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సరికొత్త వ్యూహంతో ప్రజల ముందుకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ కూటమి అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. కేవలం ఏసీ రూముల్లో రివ్యూలు, అసెంబ్లీలో ప్రసంగాలకే పరిమితం కాకుండా ప్రతి ఎమ్మెల్యే, ఎంపీ నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజల గడప తొక్కాలని చంద్రబాబు కఠిన ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ సారి సీఎం చంద్రబాబు మార్క్ ప్లానింగ్ ఊహించని విధంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు.

**హాట్ టాపిక్ గా సీఎం కండిషన్**

ఈ క్యాంపెయిన్‌లో అత్యంత ఆసక్తికరమైన అంశం నేతలు లగ్జరీ కార్లు దిగి, ప్రజల మధ్యకు సైకిళ్లపై వెళ్లాలని చంద్రబాబు రూల్ పెట్టారు. సాధారణ సైకిల్ అయితే మరీ మంచిదని, లేదంటే ఎలక్ట్రిక్ సైకిల్ (ఈ–బైక్) వాడాలని స్పష్టం చేశారు. కేవలం నేతలకు చెప్పడమే కాదు.. తాను కూడా స్వయంగా సైకిల్ తొక్కుతూ ప్రజలను కలుస్తానని బాబు ప్రకటించడం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

**అసలు వ్యూహం ఇదే!**

ఈ ఇంటింటికీ ప్రోగ్రామ్ వెనుక చంద్రబాబు రెండు ప్రధాన లక్ష్యాలను నిర్దేశించుకున్నారని చెబుతున్నారు. నేతల్లో మౌనాన్ని వీడగొట్టి ప్రజలతో మమేకమయ్యేలా చేయడం ప్రధానమంటున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఇటువంటి కార్యక్రమం నిర్వహించకపోవడంతో ఇంటింటికి ప్రభుత్వంపై అంచనాలు ఎక్కువగా పెట్టారని అంటున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెజారిటీ నేతలు సైలెంట్ అయ్యారనే టాక్ ఉంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరినీ ప్రజల్లోకి పంపి, పార్టీ యంత్రాంగాన్ని ముందస్తుగానే ఎన్నికల మూడ్‌లోకి తీసుకువెళ్లాలనే వ్యూహం కూడా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు.

మరో వైపు కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు అందించిన సంక్షేమ పథకాలు, తెచ్చిన పెట్టుబడులు, నిరుద్యోగుల కోసం సృష్టిస్తున్న ఉపాధి అవకాశాలను కరపత్రాల రూపంలో ప్రతి ఇంటికీ చేరవేయాలని ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా 'గడప గడపకూ మన ప్రభుత్వం' పేరిట ఇలాంటి ప్రోగ్రామే చేపట్టింది. కానీ, అది ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేదని ప్రభుత్వం భావిస్తోంది. అప్పట్లో ఎదురైన అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంటూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెరిగేలా ప్రస్తుత ప్రభుత్వం వ్యూహాత్మకంగా పావులు కదుపుతోందని అంటున్నారు.

గతంలో వైసీపీ నేతలు కేవలం 'మేం ఇది ఇచ్చాం, అది ఇచ్చాం' అని లబ్ధిదారుల జాబితా చదివి వినిపించారే తప్ప, స్థానిక సమస్యలను పట్టించుకోలేదని చెబుతున్నారు. కూటమి నేతలు ఆ తప్పు చేయకూడదని, తాము చేసిన మంచిని చెబుతూనే, ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఓపికగా వినాలని సీఎం దిశానిర్దేశం చేస్తున్నారు. ప్రజలు చెప్పిన సమస్యలను నోట్ చేసుకుని, వాటిని నిర్ణీత కాలంలో పరిష్కరిస్తేనే ఈ ప్రోగ్రామ్‌కు అసలైన క్రెడిట్ దక్కుతుందని చెబుతున్నారు. అదే సమయంలో ఓట్లతో సంబంధం లేకుండా ప్రతి ఇంటికి వెళ్లడం, విపక్షానికి చెందిన కార్యకర్తల ఇళ్లకు వెళ్లినప్పుడు కూడా హుందాగా వ్యవహరించడం ద్వారా మైలేజ్ పెంచుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది.

# అరంగేట్రంలోనే మానవ్ సుతార్ అదుర్స్..
# ఆఫ్ఘన్‌పై పట్టుబిగించిన భారత్

**మొహాలీలో భారత్–ఆఫ్ఘన్ ఏకైక టెస్టు**

**564 పరుగుల భారీ స్కోరు వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన భారత్**

**కెరీర్ లో తొలి టెస్టు ఆడుతున్ స్పిన్నర్ మానవ్ సుతార్‌కు 3 వికెట్లు**

**రెండో రోజు ఆట ముగిసేసరికి ఆఫ్ఘనిస్థాన్ 113/5**

**451 పరుగుల భారీ ఆధిక్యంలో టీమిండియా**

**ఫాలో–ఆన్ గండంలో ఆఫ్ఘన్ జట్టు**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో టీమిండియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. తొలి ఇన్నింగ్స్ లో భారీ స్కోరు సాధించిన గిల్ సేన, అనంతరం బౌలింగ్‌లోనూ చెలరేగి ఆఫ్ఘన్ జట్టును పీకల్లోతు కష్టాల్లోకి నెట్టింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆఫ్ఘనిస్థాన్ 5 వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. భారత జట్టు కంటే ఇంకా 451 పరుగులు వెనుకబడి ఉంది. అరంగేట్రం చేసిన లెఫ్టార్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ 3 వికెట్లతో అద్భుత ప్రదర్శన చేశాడు.అంతకుముందు, 564/8 పరుగుల వద్ద భారత్ తన తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. వాషింగ్టన్ సుందర్ (52 నాటౌట్) బాధ్యతాయుతమైన అర్ధశతకం సాధించగా, మహమ్మద్ సిరాజ్ (22) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. సుందర్ హాఫ్ సెంచరీ పూర్తి కాగానే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి, బౌలర్లకు రెండు సెషన్ల సమయం ఇచ్చాడు.తొలి ఇన్నింగ్స్ ఆడేందుకు బరిలో దిగిన ఆఫ్ఘనిస్థాన్ ఆదిలోనే తడబడింది. పదునైన బంతులతో అదరగొట్టిన మానవ్ సుతార్, అబ్దుల్ మాలిక్‌ను తన తొలి వికెట్‌గా పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత ప్రసిద్ధ్ కృష్ణ నిప్పులు చెరిగే బంతితో సెదిఖుల్లా అటల్ వికెట్ తీశాడు. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో బ్యాటర్లపై ఒత్తిడి పెంచిన సుతార్, రహ్మానుల్లా గుర్బాజ్‌ను కూడా ఔట్ చేశాడు. కవైపు వికెట్లు పడుతున్నా, రహ్మత్ షా (43 నాటౌట్) ఒంటరి పోరాటం చేశాడు. ఈ క్రమంలోనే టెస్టు క్రికెట్‌లో 1000 పరుగులు పూర్తి చేసుకున్న తొలి ఆఫ్ఘన్ ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. కెప్టెన్ హష్మతుల్లా షాహిదితో కలిసి 36 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పినప్పటికీ, ప్రసిద్ధ్ కృష్ణ అతడిని ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. కాసేపటికే అఫ్సర్ జజాయ్, సుతార్ బౌలింగ్‌లో రిటర్న్ క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో ఆఫ్ఘనిస్థాన్ ఫాలో–ఆన్ గండంలో పడింది. రేపు ఆటకు మూడు రోజు కాగా, ఆఫ్ఘన్ జట్టును వీలైనంత త్వరగా ఆలౌట్ చేయాలని టీమిండియా భావిస్తోంది.

# టీజీ 20 ఆటగాళ్ల వేలం: తిలక్ వర్మ కోసం పోటాపోటీ...
# డీజీపీ సీవీ ఆనంద్ తనయుడికి రూ.17 లక్షలు

- **హైదరాబాద్‌లో ప్రారంభమైన తొలి టీజీ20 లీగ్ ఆటగాళ్ల వేలం**
- **రికార్డు స్థాయిలో రూ.33 లక్షలకు అమ్ముడైన తిలక్ వర్మ**
- **తిలక్‌ను దక్కించుకున్న మెదక్ ఫాల్కన్స్ ఫ్రాంచైజీ**
- **మహ్మద్ సిరాజ్‌కు రూ.14 లక్షలు, సీవీ మిలింద్‌కు రూ.17 లక్షలు**
- **ఎనిమిది ఫ్రాంచైజీల మధ్య హోరాహోరీగా సాగుతున్న వేలం పాట**

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలోని స్థానిక క్రికెట్ ప్రతిభను వెలుగులోకి తెచ్చే లక్ష్యంతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్ సీఏ) ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ టీ20 (టీజీ20) లీగ్ తొలి సీజన్ ఆటగాళ్ల వేలం ప్రక్రియ ఉత్సాహభరితంగా ప్రారంభమైంది. రామోజీ ఫిల్మ్ సిటీలోని ప్రిన్సెస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం జరుగుతున్న ఈ వేలంలో యువ సంచలనం, టీమిండియా ఆటగాడు తిలక్ వర్మ రికార్డు ధర పలికాడు. ఐకాన్ ప్లేయర్ల జాబితాలో ఉన్న తిలక్ వర్మను 'మెదక్ ఫాల్కన్స్' ఫ్రాంచైజీ ఏకంగా రూ.33 లక్షల భారీ మొత్తానికి కొనుగోలు చేసింది.ఈ వేలం కోసం సుమారు 1300 మందికి పైగా హెచ్ సీఏ రిజిస్టర్డ్ క్రికెటర్లు తమ పేర్లను నమోదు చేసుకోగా, తుది జాబితాలో 160 మంది ఆటగాళు వేలానికి వచ్చారు. 8 ఫ్రాంచైజీలు ఈ వేలంలో పాల్గొంటున్నాయి. ప్రతి ఫ్రాంచైజీకి ఆటగాళ్లను కొనుగోలు చేసేందుకు రూ.60 లక్షల పర్సును కేటాయించారు. ఐకాన్ ప్లేయర్ల జాబితాలో ఉన్న తిలక్ వర్మ కోసం మెదక్ ఫాల్కన్స్, పాలమూరు స్ట్రైకర్స్ మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. చివరి వరకు ఉత్కంఠగా సాగిన బిడ్డింగ్‌లో మెదక్ ఫ్రాంచైజీ భారీ ధరకు తిలక్‌ను సొంతం చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది.ఇక టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్‌ను 'వరంగల్ వారియర్స్' ఫ్రాంచైజీ రూ.14 లక్షలకు దక్కించుకుంది. అయితే, సిరాజ్ కంటే ఎక్కువగా తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తనయుడు, దేశవాళీ సీనియర్ పేసర్ సీవీ మిలింద్ ధర పలకడం విశేషం. మిలింద్‌ను 'అన్విత ఖమ్మం ఏసెస్' జట్టు రూ.17 లక్షలకు కొనుగోలు చేసింది. ఇది దేశవాళీ టోర్నీల్లో ఆటగాళ్ల ప్రదర్శనకు ఫ్రాంచైజీలు ఇస్తున్న ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది.ఇతర కీలక ఆటగాళ్లలో రవికిరణ్‌ను పాలమూరు స్ట్రైకర్స్ రూ.13 లక్షలకు, రవితేజను మెదక్ జట్టు రూ.12 లక్షలకు, అమన్ రావును వరంగల్ వారియర్స్ రూ.12 లక్షలకు కొనుగోలు చేశాయి. తనయ్ త్యాగరాజన్ (రంగారెడ్డి), ప్రగ్యాన్ రెడ్డి (పాలమూరు), అజయ్‌దేవ్ గౌడ్ (హైదరాబాద్), మహ్మద్ ఆర్ఫాజ్ అహ్మద్ (నల్గొండ), అభిరత్ రెడ్డి (హైదరాబాద్) వంటి ఆటగాళ్లు రూ.11 లక్షల చొప్పున ధర పలికారు. మరో ఐకాన్ ప్లేయర్ తన్మయ్ అగర్వాల్‌ను కరీంనగర్ డైమండ్స్ రూ.8 లక్షలకు సొంతం చేసుకుంది.

ప్రముఖ ఆక్షనీర్ చారు శర్మ ఆధ్వర్యంలో ఈ వేలం ప్రక్రియ ప్రొఫెషనల్‌గా సాగుతోంది. ఈ లీగ్‌లో మొత్తం 8 జట్ల మధ్య 21 రోజుల పాటు 32 మ్యాచ్‌లు జరగనున్నాయి. హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం ఈ టోర్నమెంట్‌కు వేదిక కానుంది. ఆటగాళ్లపై ఫ్రాంచైజీలు చూపిస్తున్న ఆసక్తి, కురిపిస్తున్న కాసుల వర్షం చూస్తుంటే తొలి సీజన్ టీజీ20 లీగ్ విజయవంతం కావడం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## IPL ట్రోఫీలు గెలిపించిన పాటిదార్?కి టీమిండియాలోకి నో ఎంట్రీ.. అందరికీ ఛాన్స్ ఇవ్వలేమన్న BCCI

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ లో ఎంత ప్రతిభ ఉన్నప్పటికీ, కొన్నిసార్లు లక్, సెలక్టర్ల దయ లేకపోతే జాతీయ జట్టులో చోటు దక్కించుకోవడం ఎంత కష్టమో చెప్పడానికి పక్కా ఎగ్జాంపుల్.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టీమ్ కి వరుసగా రెండుసార్లు ఐపీఎల్ ట్రోఫీలు అందించి హిస్టరీ క్రియేట్ చేసిన రజత్ పాటిదార్ కు బీసీసీఐ సెలక్షన్ కమిటీ గట్టి షాక్ ఇచ్చింది.

**పాటిదార్ సెలక్ట్ చేయకపోవడంపై వివాదం:**
రాబోయే ఐర్లాండ్, ఇంగ్లాండ్ సిరీస్ లతో పాటు ఆసియా క్రీడల కోసం ప్రకటించిన భారత టీ20 స్క్వాడ్ లో రజత్ పాటిదార్ పేరు ఎక్కడా కనిపించకపోవడం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో తీవ్ర వివాదానికి దారి తీసింది. ఇప్పటివరకు 192.69 స్ట్రైక్ రేట్ తో పాటు ఏకంగా 501 పరుగులు బాదాడు. ఇందులో 30 ఫోర్లు, 42 సిక్సులు ఉన్నాయి. ముఖ్యంగా 12 నుంచి 16 ఓవర్ల మధ్య కేవలం 108 బంతుల్లోనే 216.67 స్ట్రైక్ రేట్ తో 234 రన్స్ చేశాడు. అలాగే డెత్ (17--20) ఓవర్లలో పాటిదార్ బ్యాటింగ్ స్ట్రైక్ రేట్ ఏకంగా 278.57గా ఉంది.. చివరి నాలుగు ఓవర్లలో బౌలర్లను ఏ రేంజ్ తో రజత్ ఉతికేశాడో మీరు అర్థం చేసుకోవచ్చు.

**అజిత్ అగార్కర్ ఏమ్మన్నారంటే:**
శనివారం భారత టీ20 స్క్వాడ్ ని ప్రకటించిన తర్వాత బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ మాట్లాడుతూ.. రజత్ పాటిదార్ ని ఎందుకు జట్టులోకి తీసుకోలేదో మీడియాకి చెప్పుకొచ్చాడు. భారత్ లో చాలా మంది టాలెంట్ ప్లేయర్స్ ఉన్నారు, డైరెక్టుగా జట్టులోకి వచ్చే సత్తా ఉన్నోళ్లు ఎంతో మంది ఉన్నారు.. కానీ మేము కేవలం 15 మందిని మాత్రమే ఎంపిక చేస్తాం.. ప్రస్తుతం ఆడుతున్న ఆటగాళ్లు కూడా బాగానే పర్ఫార్మ్ చేస్తున్నారు.. మేము బెస్ట్ స్క్వాడ్ నే సెలక్ట్ చేస్తాం.. కొందరికి ఛాన్స్ మిస్ కావడం సహజమే అని సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు అగార్కర్.

**ఐర్లాండ్, ఇంగ్లాండ్ సిరీస్‌లకి తుది జట్లు:**
శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు సామ్సన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, హర్షిత్ రాణా, రవి బిష్ణోయ్.

# టాలీవుడ్‌లో సీక్వెల్స్ హవా - 5000 కోట్ల భారీ బిజినెస్!

టాలీవుడ్ ఇప్పుడు సరికొత్త రికార్డుల దిశగా అడుగులు వేస్తోంది. ఒకప్పుడు సీక్వెల్స్ అంటే కేవలం ఒక సినిమా విజయవంతమైతే దానికి పొడిగింపుగా మాత్రమే చూసేవారు. కానీ నేడు ట్రెండ్ పూర్తిగా మారిపోయింది. కథ రాసుకునేప్పుడే దానిని ఒకటి కంటే ఎక్కువ భాగాలుగా.. పెద్ద సినిమాటిక్ యూనివర్స్‌గా మలిచేందుకు దర్శక,రచయితలు ఆసక్తి చూపిస్తున్నారు. రాబోయే మూడేళ్లలో టాలీవుడ్ నుంచి దాదాపు అరడజనుకు పైగా భారీ సీక్వెల్ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద దండయాత్రకు సిద్ధమవుతున్నాయి. ట్రేడ్ వర్గాల తాజా అంచనాల ప్రకారం కేవలం ఈ సీక్వెల్స్ మార్కెట్ విలువ .. బిజినెస్ సామర్థ్యం దాదాపు 5,000 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా.

ఈ భారీ సీక్వెల్స్ రేసులో అందరికంటే ముందు వరుసలో నిలుస్తున్నారు పాన్–ఇండియా స్టార్ ప్రభాస్. ఇతడు నటించిన విజువల్ వండర్ –కల్కి 2898 ఏడీ– మొదటి భాగం సృష్టించిన సంచలనం అందరికీ తెలిసిందే. ప్రస్తుతం





దీనికి కొనసాగింపుగా –కల్కి 2– షూటింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీంతో పాటు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రిలీజ్ –సలార్– కూడా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబట్టింది. ఈ హై–వోల్టేజ్ యాక్షన్ డ్రామా సీక్వెల్ –సలార్ 2: శౌర్యాంగ పర్వం– చిత్రాన్ని 2027లో సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.ప్రశాంత్ నీల్ ఇతర ప్రాజెక్టులను పూర్తి చేసిన వెంటనే 2028 సమ్మర్ కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి పక్కా షెడ్యూల్‌ను సిద్ధం చేశారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ప్రాజెక్ట్ 'ఓజి'. ముంబై అండర్‌వరల్డ్ బ్యాక్‌డ్రాప్‌లో సుజీత్ ఎంతో స్టైలిష్‌గా తెరకెక్కించిన గ్యాంగ్‌స్టర్ డ్రామా మొదటి భాగానికి విపరీతమైన క్రేజ్ వచ్చింది. దీంతో ఈ చిత్రానికి సీక్వెల్ ఉంటుందని మేకర్స్ ఇప్పటికే క్లారిటీ ఇచ్చేసారు. పవన్ కళ్యాణ్ రాజకీయ, వ్యక్తిగత డేట్స్‌పై ఆధారపడి –ఓజి 2– కథను మరింత వైలెంట్‌గా, గ్లోబల్ స్టాండర్డ్స్‌లో సుజీత్ సిద్ధం చేస్తున్నారు.అన్ని అనుకూలిస్తే 2027 ద్వితీయార్థంలో ఈ సీక్వెల్ పట్టాలెక్కే అవకాశం ఉంది. గ్లోబల్ గ్యాంగ్‌స్టర్ లుక్‌లో పవన్‌ను నెక్స్ట్ లెవెల్‌లో చూపించేలా ఈ స్క్రిప్ట్ ఉండబోతోంది. యువ దర్శకుడు ప్రశాంత్ వర్మ–హను–మాన్– చిత్రంతో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడమే కాదు. –ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్– ను స్థాపించారు. ఇందులో భాగంగానే అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న –జై హనుమాన్– చిత్రం ఇప్పటికే సెట్స్ పైకి వెళ్లింది. మొదటి భాగం సృష్టించిన మైలురాయిని అధిగమించేలా మరింత భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో బలమైన పురాణ కథాంశంతో సీక్వెల్‌ను ప్రశాంత్ వర్మ మలుస్తున్నారు.

భక్తి, కమర్షియల్ ఎలిమెంట్స్ కలయికగా రాబోతున్న చిత్రంపై ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలున్నాయి. –మిరాయ్– కి సీక్వెల్ గా –మిరాయ్ 2– కూడా ప్రకటించిన సంగతి తెలిసిందే. తేజ సజ్జా– కార్తీక్ ఘట్టమనేని కాంబినేషన్ లో రాబోతున్న చిత్రమిది. ఇదే హీరోతో ప్రశాంత్ వర్మ పర్యవేక్షణలో –జాంబీ రెడ్డి 2– కూడా రెడీ అవుతోంది. ఈ భారీ లైనప్ ఆధారంగా టాలీవుడ్ లో 5000 కోట్లకు పైగానే బిజినెస్ జరుగుతుందనే చర్చ ఫిలిం సర్కిల్స్ లో జరుగుతోంది.



**సొగసైన పింక్ చీర లుక్‌లో మాళవిక సి మీనన్ స్టన్స్**

**జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఫ్లాష్ ట్రెండ్‌ను నాశనం చేసింది**

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965